
తెలుగు ప్రజల గుండె చప్పుడు
# అక్షరమేధ 24/7
తెలుగు దినపత్రిక
MEDHA TODAY
హైదరాబాద్ సంపుటి : 6 సంచిక : 16 పేజీలు : 8 చీఫ్ ఎడిటర్ : ఎం శ్రీనివాస్ శుక్రవారం 5 డిసెంబర్ 2025 వెల : 4/-



## 'యాసిడ్' కేసుల నిర్లక్ష్యంపై 'సుప్రీం' కన్నెర్ర

- యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ
- అవసరమైతే కోర్టు స్వయంగా విచారణను కూడా చేపట్టవచ్చు
- సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దీనిపై స్పందిస్తూ,
- ఈ తరహా కేసులను త్వరగా పరిష్కరిస్తాం
- నేరస్థులు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది


# ఎన్నికలప్పుడే రాజకీయాలు

- అక్రమ సొమ్ము కోసం ఆ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి
- వారింట్లో పైసల పంచాయతీ తప్ప మరొకటి లేదు
- గ్రామాలకు నిధులు తెచ్చే వారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి
- ప్రస్తుతం తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయి
- మంత్రులతో మాట్లాడి గ్రామాలకు నిధులు తెచ్చే వారిని గెలిపించుకోండి
- గొడవలు సృష్టించే వారిని పక్కన పెట్టాలి
- ఎన్నికల్లో కూడా అడ్డగోలుగా ఖర్చు పెట్టవద్దు
- మీరు అలా ఖర్చు పెడితే అంత ఆదాయం కూడా రాదు
- ప్రధాని మోదీతో మాట్లాడి ఆదిలాబాద్ వేదికగా ప్రకటన చేస్తున్నా
- ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- కేంద్రం, విపక్షాలను కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడి




**ఆదిలాబాద్**

ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలని.. తర్వాత అభివృద్ధే లక్ష్యం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని కేంద్రంలోని నేతలను కూడా ఆహ్వానించానన్నారు. గురువారం.. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లలో ఒక్కరోజైనా సెలవు తీసుకోలేదని.. విపక్ష నేతలను కలుపుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సీఎం సభల్లో విపక్ష ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇచ్చారా? అంటూ రేవంత్ ప్రశ్నించారు. "ఎన్నికలయ్యాక ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యం. ఏడాదిలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తాం. ఎర్రబస్సు రావడం కష్టమనుకున్న - మిగతా3లో



## భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

- స్వాగతం పలికిన ప్రధాని మోదీ
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి
- విమానాశ్రయంలో కళాకారుల నృత్యాలతో సంప్రదాయ స్వాగతం
- భారత్.. రష్యాతో తన వాణిజ్య లోటును మెరుగుపరచుకోవాలని ఆశిస్తోంది



## డుమ్మాకొడితే పనిష్మెంట్ తప్పదు

ఇకపై విద్యార్థులే కాదు.. స్కూల్‌కు డుమ్మాకొట్టే టీచర్లకు సైతం పనిష్మెంట్ తప్పదు!

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై ఫోకస్

ఇక బడికి వెళ్ళని టీచర్లకు విద్యా శాఖ షాక్ ఇవ్వబోతోంది

# అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ

- ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నది
- ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావు
- ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములు
- మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నది




**హైదరాబాద్**

హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్‌ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం- మిగతా3లో

## రూపాయి పతనం

యూఏఈ నుంచి వెల్లువెత్తున్న నగదు!

రోజురోజుకు క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ

రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?

యూఏఈ నుంచి భారత్‌కు మూడింతలు పెరిగిన రెమిటెన్స్‌లు

దిర్హమ్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడమే కారణం

ఇదే అదనుగా స్వదేశానికి భారీగా డబ్బు పంపుతున్న ప్రవాసులు

మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయిన రూపాయి



# సెంటిమెంట్ రగిల్చి లబ్ధిపొందే యత్నం

- బీఆర్‌ఎస్‌పై పీసీసీ చీఫ్ ఫైర్
- సెంటిమెంట్ రగల్చి బీఆర్‌ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని
- దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారు.
- దాన్ని రాజకీయం చేయడం తగదు.. బీఆర్‌ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారు.
- హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయి



**హైదరాబాద్**

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్‌ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని వెల్లడించారు మహేష్ గౌడ్. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. - మిగతా3లో

## అమెరికా నుంచి 18,822 మంది భారతీయుల బహిష్కరణ

- 2009 నుంచి ఇప్పటివరకు 18,822 మంది భారతీయులను బహిష్కరించిన అమెరికా
- ఈ ఏడాదిలోనే 3,258 మందిని వెనక్కి పంపినట్లు వెల్లడి
- రాజ్యసభలో వివరాలు తెలిపిన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్
- బహిష్కరణల వెనుక మానవ అక్రమ రవాణా కీలక కారణమన్న మంత్రి



# రూపాయి పతనం



గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు నగదు ప్రవాహం భారీగా పెరిగింది. భారత రూపాయి విలువ పతనం కావడంతో, అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపే డబ్బు (రెమిటెన్స్‌లు) ఏకంగా మూడింతలు పెరిగినట్లు 'ఖలీజ్ టైమ్స్' తన కథనంలో వెల్లడించింది. ప్రస్తుతం ఒక యూఏఈ దిర్హామ్‌కు 24.5 భారత రూపాయల మారకం విలువ లభిస్తుండటంతో, ఇదే సరైన సమయమని భావించి ఎన్నారైలు పెద్ద మొత్తంలో డబ్బు పంపుతున్నారు.

యూఏఈ కరెన్సీ అయిన దిర్హామ్‌ను రూపాయితో మార్చుకున్నప్పుడు గతంలో కంటే ఎక్కువ మొత్తం చేతికి వస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని అక్కడి భారతీయులు చెబుతున్నారు. షార్జాలో నివసించే ఆరిఫ్ ఖాన్ అనే వ్యక్తి మాట్లాడుతూ, తాను సాధారణంగా ప్రతినెలా 1,200 నుంచి 1,500 దిర్హామ్‌లు పంపేవాడినని, కానీ రూపాయి పతనం కారణంగా ఈసారి 4,500 దిర్హామ్‌లు పంపినట్లు తెలిపారు. దుబాయ్‌లో ఉండే ఆంథోనీ వర్ఘీస్ అనే మరో ప్రవాసుడు మాట్లాడుతూ, ఇది తమకు ముందుగానే వచ్చిన క్రిస్మస్ బహుమతి అని అభివర్ణించారు. "సాధారణంగా 2,000 దిర్హామ్‌లు పంపే నేను, ఈసారి 3,000 పంపాను. ఈ అదనపు డబ్బు ఇండియాలోని మా కుటుంబానికి స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది" అని ఆయన వివరించారు.

ఇదిలాఉండగా, అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడం, భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి వంటి కారణాలతో రూపాయి బలహీనపడుతోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి చేరింది. ఈ పతనం మరికొంత కాలం కొనసాగవచ్చని, రూపాయి విలువ 91 మార్కును కూడా తాకే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రూపాయి మారకం విలువ రోజురోజుకు క్షీణిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో యూఎస్ డాలర్‌కు డిమాండ్ నెలకొనడంతో రూపాయి లైఫ్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పటికే 90.15 స్థాయికి పడిపోయిన విలువ గురువారం మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయింది. రూపాయి విలువ పతనం మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం రూ.90.70–91 మార్కును తాకుతుందని పేర్కొన్నారు.కాగా, బుధవారం ఉదయం 89.96 వద్ద ప్రారంభమైన డాలర్–రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 90.30 స్థాయికి పతనమైంది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 19 పైసలు తగ్గి 90.15కి జారుకున్నది. మంగళవారం రూపాయి విలువ 43 పైసలు కోల్పోయి 89.96కి పడిపోయిన విషయం తెలిసిందే.

దిగుమతిదారుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ నెలకొనడం రూపాయి పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 5 శాతం పతనం చెందింది.

**రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?**

అంతర్జాతీయంగా అన్ని కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు గురవుతున్నాయని, ఇదే క్రమంలో రూపాయి పతనం చెందింది తప్పా.. బలహీనమైన కరెన్సీ మాత్రం కాదని ఎస్బీఐ ఎకానమిక్ రీసర్చ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు, ఈవారంలోనే వడ్డీరేట్ల తగ్గింపుపై రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకోనుండటం కూడా రూపాయి పతనానికి బ్రేక్ వేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. స్వల్పకాలంలో డాలర్–రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 89.90 నుంచి 91.20 మధ్యలో నమోదుకానున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,206 కోట్ల షేర్లను విక్రయించడం కూడా రూపాయి పతనానికి ఆజ్యంపోసింది. దేశీయ ఎగుమతులు నీరసించడం, వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్ఠంభన నెలకొనడం విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళనన నెలకొన్నది.

**ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం**

రూపాయి పతనంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా దిగుమతులపై అత్యధికంగా ఆధారపడుతున్న భారత్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వారు వెల్లడిస్తున్నారు. చమురు బిల్లుల కోసం అధికంగా వెచ్చించాల్సి రావచ్చునని అంటున్నారు. ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు ఇది పెద్దదెబ్బేనని వారు అంటున్నారు.

**భారంగా మారిన విదేశాల్లో ఉన్నత విద్య**

రోజురోజుకూ దారుణంగా పడిపోతున్న రూపాయి విలువ కంటికి కనిపించని దెబ్బ కొడుతున్నది. డాలరుతో రూపాయి మారకం విలువ బుధవారం రూ.90 దాటింది. రూపాయి విలువ బలహీనపడుతున్నకొద్దీ దిగుమతి సరుకుల ధరలు భారీగా పెరుగుతుండగా, ఎగుమతి అయ్యే వస్తువులు చౌకగా మారిపోతున్నాయి. ముఖ్యంగా చమురు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. పతనమవుతున్న రూపాయి విలువతో ప్రధానంగా ప్రభావితమవుతున్నవారు విదేశాల్లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు. ఇది వారి కుటుంబాలను కంటికి కనిపించని రీతిలో దెబ్బ కొడుతున్నది. రూపాయి విలువ తగ్గడం కారణంగా అమెరికా, బ్రిటన్, ఇటలీ, జర్మనీ, సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చదువుతున్న విద్యార్థులు, వారి కుటుంబాలకు ఆర్థిక భారం తడిసి మోపెడవుతున్నది.ఇటు రూపాయి పతనం అటు విద్యార్థుల వార్షిక ఫీజు, వారి జీవనంపై భారం మోపుతున్నది. ఫీజులు లక్షల్లో పెరుగుతున్నాయి. అదే సమయంలో విదేశీ మారకంలో తీసుకున్న విద్యా రుణాలు కూడా పెరిగిపోతున్నాయి. గత ఏడాది భారత్ నుంచి విదేశాలకు చదువుకోవడానికి వెళ్లిన వారి సంఖ్య 7.6 లక్షలు. న్యూయార్క్ యూనివర్సిటీలో చదువుతున్న సంజనా కుమార్ తన అనుభవాన్ని చెప్తూ..'మా తల్లిదండ్రులు నాకు ఖర్చుల కోసం నెలకు 1500 డాలర్లు పంపుతారు. గత ఏడాది డాలర్ విలువ రూ.83.5 ఉన్నప్పుడు నా తల్లిదండ్రులకు రూ.1.25 లక్షలు ఖర్చయ్యేవి. ఇప్పుడు అవే 1500 డాలర్లకు వారికి మరో రూ.10 వేలు ఎక్కువగా ఖర్చవుతున్నాయి' అని వివరించారు.

# భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్




**న్యూఢిల్లీ:** రెండురోజుల పర్యటన భారత పర్యటన కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిన్ పుతిన్ ఢిల్లీకి చేరుకున్నారు. పాలం ఎయిర్‌పోర్ట్‌కు పుతిన్ విమానం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుతిన్, మోదీ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విమానాశ్రయంలో కళాకారుల నృత్యాలతో సంప్రదాయ స్వాగతం పలికారు. పుతిన్, ప్రధాని మోదీ ఇద్దరు ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. పుతిన్‌కు గౌరవార్థం గురువారం రాత్రి ప్రధాని విందు ఇవ్వనున్నారు. రేపు ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం పలుకున్నారు. అలాగే, 23వ భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పుతిన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా అణువిద్యుత్ సహా పలు రంగాల్లో రెండుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరుగనున్నాయి. అంతకు ముందు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా.. రష్యా ఆరోగ్యమంత్రి మిఖాయిల్ మురాష్కోతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆరోగ్యరంగంలో ద్వైపాక్షిక సహకారం, భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు అంగీకరించారు.

ఇదిలా ఉండగా.. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. భారత్–రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర భేటీలో భాగంగా మోదీతో సమావేశమవుతారు. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు గతంలో పుతిన్ పేర్కొన్నారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపై సైతం చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ పర్యటన భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఆర్థిక సహకారాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అధ్యక్షుడు పుతిన్ వ్యాపారవేత్తలతో కలిసి పర్యటిస్తున్నారు. భారత్.. రష్యాతో తన వాణిజ్య లోటును మెరుగుపరచుకోవాలని ఆశిస్తోంది. ఔషధాలు, ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తుల రంగాల్లో సహా రష్యాకు భారత ఎగుమతులను పెంచడానికి అనేక మార్గాలను అన్వేషిస్తున్నది. దాంతో భారత్ ఉత్పత్తులకు భారీ మార్కెట్ ఏర్పడనున్నది. ఉద్యోగాలతో పాటు రైతులకు లాభదాయకంగా ఉండనున్నది. షిప్పింగ్, ఆరోగ్య సంరక్షణ, ఎరువులు, కనెక్టివిటీ రంగాల్లో ఒప్పందాలు, ఎంవోయూలు కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, సంస్కృతి, శాస్త్రీయ సహకారంలో కూడా మరింత సహకారం పెరుగనున్నది.

**రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక.. ఢిల్లీలో హై అలర్ట్..**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటన సందర్భంగా గురువారం రాజధాని ఢిల్లీకి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధాని చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేశారు. వీవీఐపీ పర్యటనను దృష్టిలో ఉంచుకుని నగరమంతా హై–అలర్ట్‌లో ఉంచారు. స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్)బృందాలు, ఉగ్రవాద నిరోధక విభాగాలు, స్నిపర్‌లు, త్వరిత–ప్రతిచర్య బృందాలతో కూడిన బహుళ–స్థాయి భద్రతా గ్రిడ్ ఏర్పాటు చేశారు. 5,000 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. పుతిన్ రాక మొదలుకొని వెళ్లే వరకూ ఆయన కదలికలన్నింటినీ బహుళ భద్రతా ఏజెన్సీలు ట్రాక్ చేయనున్నాయి. యాంటీ–డ్రోన్ వ్యవస్థలు అమలులో ఉండగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు సలహాలు జారీ చేయనున్నారు. రాజధాని నగరంలో మోదీ–పుతిన్ చిత్రాలతో కూడిన భారీ హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. పుతిన్ గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనున్నారు. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు భారత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి 23వ భారత్–రష్యా వార్షిక వ్యూహాత్మక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశం కేవలం దౌత్యపరమైన అంశాలకు మాత్రమే పరిమితం కాకుండా, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇరు దేశాల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడానికి దోహదపడనుంది. ఈ అధికారిక చర్చలకు ముందు, ప్రధాని మోదీ తన నివాసంలో పుతిన్‌కు ప్రైవేట్ విందు ఇవ్వనున్నారు. ఈ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కూడా పుతిన్ సమావేశం కానున్నారు. ఈ శిఖరాగ్ర సమావేశం అజెండా విభిన్న రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై దృష్టి సారించింది. ముఖ్యంగా వాణిజ్యం, ఆర్థిక సహకారం, పారిశ్రామిక సహకారం, వినూత్న సాంకేతికతల బదిలీ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. శాంతియుత అంతరిక్ష అన్వేషణ, మైనింగ్, ఆరోగ్య సంరక్షణ, కార్మిక వలస కార్యక్రమాలలో కొత్త 'ఆశాజనక ప్రాజెక్టులు' కూడా చర్చల జాబితాలో ఉన్నాయి. రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య బలమైన బంధం ఉన్నప్పటికీ, ఈ పర్యటన ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని పెంచడానికి ఒక వేదికగా ఉపయోగపడనుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

## 18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

**ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు**

**బీజాపూర్ జిల్లాలో భీకర పోరుల**

**ముగ్గురు డీఆర్జీ జవాన్లు కూడా వీరమరణం**

**ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మరణించారు. ఈ భీకర కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది కూడా వీరమరణం పొందారు. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు ఇదే అతిపెద్ద నష్టమని అధికారులు భావిస్తున్నారు. గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండోలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు దీటుగా స్పందించాయి. చాలా గంటల పాటు సాగిన ఈ పోరులో తొలుత 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు ప్రకటించారు. గురువారం ఉదయం ఘటనా స్థలంలో జరిపిన గాలింపు చర్యల్లో మరో ఆరు మృతదేహాలు లభించడంతో మృతుల సంఖ్య 18కి చేరింది. ఈ పోరాటంలో డీఆర్జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ మోను మోహన్ బడ్డి, కానిస్టేబుల్ దుకారు గోండే, జవాన్ రమేశ్ సోడీ కూడా మరణించారు. వారి మృతదేహాలను బీజాపూర్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించి, ఉన్నతాధికారులు, తోటి జవాన్లు ఘనంగా నివాళులర్పించారు. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర సింగ్ మీనా తెలిపారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

## 'యాసిడ్' కేసుల నిర్లక్ష్యంపై 'సుప్రీం' కన్నెర్ర



**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా యాసిడ్ దాడి కేసుల విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యంపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ కోర్టులో 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును 'జాతీయ అవమానం'గా ధర్మాసనం అభివర్ణించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం.. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులలో పెండింగలో ఉన్న యాసిడ్ దాడి కేసులను నాలుగు వారాల్లోగా విచారణ జరిపి, వివరాలను తమకు సమర్పించాలని ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రోహిణి కోర్టులో 2009 నుండి పెండింగ్‌లో ఉన్న బాధితురాలి కేసులో పదేపదే జరుగుతున్న ఆలస్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై మాలిక్ తన కేసు ఎందుకు ఇంకా ముగియలేదో వివరిస్తూ, ఒక దరఖాస్తును దాఖలు చేయాలని కోర్టు కోరింది. అవసరమైతే కోర్టు స్వయంగా విచారణను కూడా చేపట్టవచ్చని కూడా సూచించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దీనిపై స్పందిస్తూ, ఈ తరహా కేసులను త్వరగా పరిష్కరిస్తామని, నేరస్థులు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. తక్షణ న్యాయం అందించేందుకు, యాసిడ్ దాడి కేసులను ప్రత్యేక కోర్టులు విచారించడం ఉత్తమమని ప్రధాన న్యాయమూర్తి కాంత్ సూచించారు. అంతేకాకుండా యాసిడ్ దాడి బాధితులను వైకల్యం ఉన్న వ్యక్తులుగా వర్గీకరించాలని, వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు కల్పించాలని మాలిక్ చేసిన విజ్ఞప్తిపై స్పందించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. నిరంతర వైద్య సంరక్షణలో ఉంటూ, బాధితులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులను మాలిక్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

## అమెరికా నుంచి 18,822 మంది భారతీయుల బహిష్కరణ



2009 నుంచి ఇప్పటివరకు 18,822 మంది భారత పౌరులను అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో ఈ ఏడాది (2025) జనవరి నుంచి ఇప్పటి వరకు 3,258 మందిని వెనక్కి పంపినట్లు తెలిపింది. ఇవాళ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి అందించిన వివరాల ప్రకారం.. 2023లో 617 మంది, 2024లో 1,368 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. ఈ ఏడాది వెనక్కి వచ్చిన 3,258 మందిలో 2,032 మంది (సుమారు 62.3 శాతం) సాధారణ కమర్షియల్ విమానాల్లో రాగా, మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారుల ప్రత్యేక చార్టర్ విమానాల్లో భారత్‌కు పంపించారు. ఈ బహిష్కరణల వెనుక మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) కీలక కారణంగా ఉందని జైశంకర్ సభకు వివరించారు. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విచారణ జరుపుతున్నాయని, పంజాబ్‌లో ఈ తరహా కేసులు అత్యధికంగా నమోదయ్యాయని తెలిపారు. ఎన్ఐఏ ఇప్పటివరకు 27 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు చేసి, 169 మందిని అరెస్ట్ చేసిందని మంత్రి పేర్కొన్నారు. 132 మందిపై ఛార్జ్‌షీట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 7న హర్యానా, పంజాబ్‌లో ఇద్దరు కీలక ట్రాఫికర్లను, అక్టోబర్ 2న హిమాచల్ ప్రదేశ్‌లో మరో ఇద్దరిని ఎన్ఐఏ అరెస్ట్ చేసిందని జైశంకర్ వివరించారు.

## స్తంభించిన ఇండిగో సేవలు.. !

## సోదరుడు చనిపోయినా వెళ్లేకపోతున్నామని ప్రయాణికుడి ఆవేదన..!




దేశవ్యాప్తంగా ఇండిగో సేవలు స్తంభించాయి. సాంకేతిక సమస్యల కారణంగా సేవలు భారీగా ప్రభావితమయ్యాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు సహా పలు నగరాల్లో దాదాపు 300పైగా విమారాలు రద్దయ్యాయి. ఇండిగో విమానాల ఆలస్యం, రద్దు కారణంగా పుణే విమానాశ్రయంలో పరిస్థితి మరింత దిగజారింది. ప్రయాణికుడు సతీశ్ కాలే మాట్లాడుతూ.. తాము ప్రయాణించాల్సిన విమానం ఉదయం 7 గంటలకు షెడ్యూల్ అయ్యింది. విమానం ఆలస్యంగా నడుస్తుందని కానీ, రద్దు చేసినట్లుగా కానీ తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునే వరకు.. విమానాశ్రయం పూర్తిగా నిండిపోయిందని.. ప్రయాణికులకు ముందస్తుగానే సమాచారం ఇవ్వాలన్నారు. ఎయిర్‌లైన్స్ సైలెన్స్ స్ట్రయిక్ చేస్తోందని ప్రయాణికుడు మండిపడ్డాడు. ఏవియేషన్ ఇండస్ట్రీలో తమకు ఇప్పటికే గుత్తాధిపత్యం ఉందని చూపించాలనుకుంటున్నారని.. సిబ్బంది లేరని ఇండిగో చెబుతోందని మరో ప్రయాణికుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముగ్గురు ప్రయాణికులు స్పృహ కోల్పోయారని.. ప్రభుత్వం ఇండిగోకు ప్రత్యామ్నాయం వెతకాలని సూచించారు. ఎయిర్‌బస్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా సమస్యలు వస్తున్నాయని ముంబయికి చెందిన ప్రయాణికుడు సంజయ్ తెలిపారు. రెండు రోజులుగా విమానాలు నిలిచిపోయాయని.. దాంతో కనెక్టింగ్ ఫ్లయిట్‌ను సైతం మిస్ అయినట్లు చెప్పాడు. ఎయిర్‌లైన్, మంత్రిత్వశాఖ సైతం సహాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జుమ్మన్ అలీ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన సోదరుడు చనిపోయాడని.. టికెట్ ధరలు రూ.36వేల నుంచి రూ.46వేలకు పెరిగాయని.. అయినప్పటికీ ఇప్పటికీ విమానాలు అందుబాటులేవని వాపోయాడు. తన తల్లిదండ్రులు ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయారని చెప్పాడు. జమ్మూ నుంచి ఢిల్లీకి వెళ్లే విమానం నాలుగు గంటలకుపైగా ఆలస్యంగా నడుస్తుందని సమాచారం ఇచ్చారని.. ఈ విమానం ఎప్పుడు బయలుదేరుతుందో తమకు తెలియదని ఓ ప్రయాణికుడు చెప్పాడు. తొలుత విమానం 10.30 గంటలకు షెడ్యూల్ చేశారని.. మళ్లీ ఢిల్లీ విమానం 15.30 గంటలకు తిరిగి షెడ్యూల్ చేశారని ప్రయాణికుడు చెప్పుకొచ్చాడు. చెన్నైలో కూడా భారీగా విమానాలు ప్రభావితమయ్యాయి. తాను ఇండిగో సేవలతో విసిగిపోయానని.. నిన్న ముంబయి నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన విమానం రద్దయ్యిందని.. ఆ తర్వాత చెన్నైకి మళ్లించారని.. అక్కడికి చేరుకున్నాక విమానం రద్దయ్యిందని ఓ ప్రయాణికుడు వాపోయాడు. పోర్ట్ బ్లెయిర్ నుంచి కోల్‌కతాకు వెళ్లే విమానం కూడా రద్దయ్యిందని.. విమానాలు ఆలస్యం, రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విమాన కార్యకలాపాలు ఎప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటాయో స్పష్టమైన సమాచారం లేదు.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు

-మొదటిపేజీ తరువాయి

ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తున్నాం. అత్యంత వెనకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా. ఆదిలాబాద్‌కు నీళ్ల కోసం ప్రాణిహిత?– చేవెళ్ల ప్రాజెక్టు పనులను వైఎస్ ప్రారంభించారు. అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా" అని రేవంత్ పేర్కొన్నారు. "జిల్లా అభివృద్ధికి రెండు నెలల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. మళ్లీ తొందరలోనే ఆదిలాబాద్ వచ్చి సమీక్ష చేస్తాను. ఇంద్రవెల్లిలో యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నా. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇచ్చారా?. మేం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు 61 వేల ఉద్యోగాలు ఇచ్చాం. కాళేశ్వరం.. కూలేశ్వరం అయింది. ప్రజల సొమ్ము తిన్నవారు బాగుపడరు" అంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



### అక్రమ సొమ్ము కోసం ఆ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఓ కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుందని, ఇప్పుడు ఆ కుటుంబంలో అక్రమ సొమ్ము కోసం గొడవలు జరుగుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ,

కేసీఆర్ లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు బిడ్డ ఒక దిక్కు, కొడుకు ఒక దిక్కు, ఆయన ఎక్కడ పడుకున్నారో ఎవరికీ తెలియదని కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి అన్నారు. ప్రజలను దోచుకున్న వారు బాగుపడినట్లు చరిత్రలో లేదని మండిపడ్డారు. ఈ రోజు నడుస్తున్న చరిత్ర కూడా అదేనని అన్నారు. ఇప్పుడు వారింట్లో జరుగుతోంది పైసల పంచాయితీ తప్ప మరొకటి కాదని అన్నారు.

### అలాంటి వారిని ఎన్నుకోండి

ప్రస్తుతం తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయని, మంత్రులతో మాట్లాడి గ్రామాలకు నిధులు తెచ్చే వారిని గెలిపించుకోండని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. గొడవలు సృష్టించే వారిని పక్కన పెట్టాలని అన్నారు. ఎన్నికల్లో కూడా అడ్డగోలుగా ఖర్చు పెట్టవద్దని, మీరు అలా ఖర్చు పెడితే అంత ఆదాయం కూడా రాదని అన్నారు. నిధులు ఇస్తామని, గ్రామాలను అభివృద్ధి చేసుకోండని సూచించారు. కేంద్రం వద్దకు తాము వెళ్లి నిధులు తెచ్చుకున్నట్లు, సర్పంచ్‌లు కూడా మంత్రుల వద్దకు వెళ్లి నిధులు తెచ్చుకోగల గాలని అన్నారు. మంచివారిని ఎన్నుకోండి.. నిధులిచ్చే బాధ్యత మాదే అన్నారు. విద్యార్థులు కూడా ఎన్నికలు అంటూ తిరగవద్దని, బాగా చదువుకుని, ఐపీఎస్, ఐఏఎస్, డాక్టర్లు కావాలని అన్నారు. అప్పుడే ఈ రేవంతన్న సంతోషంగా ఉంటాడని అన్నారు.

### ప్రధాని మోదీతో మాట్లాడి ఆదిలాబాద్ వేదికగా ప్రకటన చేస్తున్నా

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడిన తర్వాత అదిలాబాద్ వేదికగా ప్రకటన చేస్తున్నానని, సంవత్సరం తిరిగేలోగా ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులను ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో రూ.260 కోట్లతో అభివద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, తాను రెండేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని అన్నారు.

విపక్ష నేతలను కలుపుకుని తాము ముందుకు పోతున్నామని ఆయన అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి విపక్ష ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు తాము ప్రతిపక్షాలతో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించానని, దేశంలోని ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించుకుని ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తాను కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కావొచ్చు.. కానీ కేంద్రం సహకారంతో ముందుకు సాగాలని, అందుకే మోదీతో మాట్లాడిన తర్వాత విమానాశ్రయంపై ప్రకటన చేస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు.

ఎర్రబస్సు కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు తీసుకు వచ్చి, పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటామని హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే రెండు నెలల్లో అభివృద్ధి ప్రణాళికతో మళ్లీ వస్తానని, అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆదిలాబాద్‌ను ఆదర్శ జిల్లాగా చేస్తానని అన్నారు.

కన్నతల్లితో సమానమైన సోనియా గాంధీ ఆశీర్వాదం తీసుకుని తాను ఇక్కడకు వచ్చానని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో సున్నపు గనులు ఉన్నాయని, కాబట్టి ఇక్కడకు పరిశ్రమను తీసుకువచ్చి వ్యాపార కేంద్రంగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తామని అన్నారు. విద్య, నీటి పారుదల విషయంలో ఆదిలాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సిద్ధమని, కానీ ఎక్కడ నిర్మించాలో జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. ఆదిలాబాద్‌కు విశ్వవిద్యాలయం ఇచ్చే బాధ్యత నాదే, కానీ ఎక్కడ కావాలో మీరే నిర్ణయించుకోండని అన్నారు. తన ఆలోచన మేరకు ఇంద్రవెల్లి బాగుంటుందని, అయితే ఇది తన సూచన మాత్రమేనని, నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉన్నారు కాబట్టే మన వద్ద రెండేళ్లుగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, పంటలు సమృద్ధిగా పండుతున్నాయని అన్నారు.

# చంపేస్తున్న చలి...

**అదిలాబాద్ :** చలి తీవ్రత అధికం కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఊహించిన దాని కంటే అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.తెలంగాణ, ఉత్తర కర్ణాటకతో పాటు మధ్య, వాయవ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయన్న వివరాలపై భారత వాతావరణ శాఖ ఐఎండీ ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. ఆయా ప్రాంతాల్లో పగలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా రికార్డు అవుతాయని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే అధికంగా రికార్డు అవుతాయని పేర్కొంది. ఈ నెల దక్షిణాదిన సాధారణం లేదా అంతకంటే అధికంగా వర్షపాతం రికార్డు అవుతుందని చెప్పింది.ఉత్తర కోస్తాలో సాధారణం కంటే అధికంగా, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అవుతుందని తెలిపింది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దానితో పాటు లా నినా ప్రభావంతో చలి గాలులు పెరుగుతాయని ఐఎండీ చెప్పింది. చలి పెరగడంతో



వృద్ధులు, చిన్నారులతో పాటు గుడిసెల్లో నివసించే సంచార జాతుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

# వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే పదవి ఖాయం

**హైదరాబాద్ :** డీసీసీల నియామకం అయిపోయింది. పార్టీ పదవులు ఒక్కొక్కటిగా భర్తీ అయిపోతున్నాయ్. ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే మిగిలాయి. హెవీ కాంపిటీషన్ ఉండటంతో..వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాన్ని ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. ఆల్ ఆఫ్ సడెన్ గా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన హింట్ తో రేసు మొదలైందట. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం లాబీయింగ్ స్టార్ట్ చేశారట లీడర్లు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నదెవరు? ఛాన్స్ దక్కె నేతలెవరు?తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి పదవుల పందేరం మొదలైంది. వరుసగా ఒక్కొక్కటిగా పార్టీ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది ఏఐసీసీ. ఈ మధ్య కాలంలో వైస్ ప్రెసిడెంట్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, జనరల్ సెక్రటరీలు..లేటెస్ట్ గా డీసీసీ డీసీసీ ప్రెసిడెంట్లను నియమించారు. ఇక ఫైనల్ గా మిగిలింది ఒక్క వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే. ఈ కీలకమైన పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉంది. కీలకమైన నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. అయితే గాంధీభవన్ లో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేస్తామని చెప్పారు. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం నేతలు మరోసారి లాబీయింగ్ స్టార్ట్ చేశారట.కాంగ్రెస్ పార్టీలో పీసీసీ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు అత్యంత కీలకమైనది. ఈ పోస్టులో గతంలో పని చేసిన వారందరూ ఇప్పుడు కీలకమైన పోస్టులో ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ లోకి రాగానే



వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేసిన వారే. ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కూడా లాస్ట్ టర్మ్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీలకమైన నేతలే పని చేయడంతో ఇప్పుడు ఈ పోస్ట్ కు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ సారి వర్కింగ్ ప్రెసిడెంట్లను సామాజిక వర్గాల వారీగా కీలకమైన వ్యక్తులకు ఛాన్స్ ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోంది.వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం సామాజికవర్గాల వారీగా ఈసారి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోందట. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కరికి ఛాన్స్ ఉండటంతో..పోటీలో మాత్రం చాలా మంది క్యూలో ఉన్నారట. రెడ్డి సామాజికవర్గం నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రోహిన్ రెడ్డితో పాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా రేసులో ఉన్నారట.నాయిని రాజేందర్ రెడ్డికి వైస్ ప్రెసిడెంట్ గా అవకాశం ఇచ్చినా..ఆయన ఆ పోస్టును తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక ఎంపీ చామల అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఫైనల్ గా రోహిన్ రెడ్డికి అవకాశం ఇస్తారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక బీసీ సామాజికవర్గం నుంచి టీఎస్ఎండీసీ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారట.ఎస్సీ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లాబీయింగ్ చేస్తున్నారట. ఎస్టీ సామాజికవర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ రేసులో ఉన్నారని అంటున్నారు. ఎంపీ బలరాం నాయక్ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేసినా..వర్క్ ఔట్ కాలేదని..దాంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇక ఫైనల్ గా మైనారిటీ కోటాలో ఫిరోజ్ ఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఖమ్మం మాజీ డీసీసీ అధ్యక్షుడు జావిద్ రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ కీలకమైన పోస్టు ఎవరెవరికి దక్కుతుందనేది చూడాలి

## అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ

-మొదటిపేజీ తరువాయి

పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు.

రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శన మన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

## సెంటిమెంట్ రగిల్చి లబ్ధిపొందే యత్నం

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. కాగా.. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

## డుమ్మాకొడితే పనిష్మెంట్ తప్పదు

రాష్ట్రంలో సుమారు లక్షా పదివేల మంది సర్కారు స్కూల్ టీచర్లు ఉన్నారు. వీరికి ఇటీవల ఎఫ్ఆర్ఎస్ విధానం మొదలైంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు టీచర్లు బడులకు డుమ్మాలు కొడుతున్నారు. నెలల తరబడి రాకపోవడంతో ఆయా బడుల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే ఇక టీచర్లు ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా 30 రోజులు వరుసగా స్కూల్కు రాకపోతే వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ నిర్ణయించింది. ఇటీవల జరిగిన డీఈఓల సమావేశంలో డైరెక్టర్ నవీన్ నికోలస్ వారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ నోటీసులకు సంబంధిత టీచర్ ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. సరైన కారణం లేకుండా విధులకు డుమ్మా కొట్టినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. గతంలో అటెండెన్స్ ను రిజిస్టర్ల ద్వారా తెలుసుకునే అవకాశం ఉండేది. దీంతో హెడ్మాస్టర్, ఎంఈఓ, డీఈఓ అంటూ సమాచారం సేకరించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎఫ్ఆర్ఎస్ విధానంతో ఎవరెవరు రెగ్యులర్ గా రావడం లేదనేది ఈజీగా గుర్తించే అవకాశం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఎస్ఆర్ఎస్ విధానంతో బడుల్లో టీచర్ల హాజరు పెరిగింది. ఈ విధానంతో ఎక్కడెక్కడ ఎవరు స్కూల్కు రావట్లేదో క్షణాల్లో తెలిసిపోతోంది. డుమ్మా కొడుతున్న టీచర్ల డేటాను స్టేట్ ఆఫీసు నుంచే అధికారులు ప్రతినెలా క్రోడీకరించి ఆయా జిల్లాల డీఈఓలకు పంపిస్తున్నారు. డుమ్మా కొట్టిన టీచర్లకు ఆ లిస్ట్ ఆధారంగా డీఈఓలు నోటీసులు జారీ చేయనున్నారు. కాగా గత రెండేండ్లలో ఇలాగే నిబంధనలకు విరుద్ధంగా విధులకు హాజరుకాని దాదాపు 50 మంది టీచర్లను విద్యాశాఖ సర్వీసు నుంచి తొలగించింది. భవిష్యత్తు లోనూ ఇదే తీరు కొనసాగుతుందని, టీచర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్ణయాల వల్ల పాఠశాల విద్య మరింత బలోపేతం అవుతుందంటున్నారు విద్యా వేత్తలు.

## టీసీయూఆర్‌గా గ్రేటర్ హైదరాబాద్

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అనే పేరు ఇక చరిత్రలో కలిసిపోయే అవకాశాలు ఉన్నాయి. ఆరు జోన్లు, 30 సర్కిళ్లతో ఉన్న జీహెచ్ఎంసీ త్వరలోనే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా మారనున్నట్లు




తెలుస్తోంది.దీనిపై సమగ్ర ప్రణాళిక త్వరలో వెలుపడే అవకాశముంది. అలాగే, టీసీయూఆర్ పరిధిలోని ప్రాంతాన్ని మూడు విభాగాలు విభజించే ప్రతిపాదన ఉంది. అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. (ఉఊఓఅ)ఢిల్లీలో ఇలాగే ఎన్సీఆర్ (నేషనల్ కేపిటల్ రీజియన్) ఉన్న విషయం తెలిసిందే. ఆ తరహాలోనే హైదరాబాద్‌లో టీసీయూఆర్ అధికారికంగా మారనుంది. జీహెచ్ఎంసీలో 27 మునిసిపల్ బాడీలను విలీనం చేసి, జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించే క్రమంలో అతి పెద్ద మహానగరంగా మారనుంది హైదరాబాద్. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా పేరు మార్పునకు మార్గం సుగమం చేసింది. ప్రభుత్వం మూడు ఆర్డినెన్సులను జారీ చేసి, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో మునిసిపల్ చట్టంలో మార్పులు చేయనున్నట్లు సమాచారం. టీసీయూఆర్ హైదరాబాద్‌కు చట్టబద్ధత కల్పిస్తారు. దీంతో అధికారికంగా విలీన ప్రక్రియ పూర్తికానుంది.

# సంపాదకీయం

## అంతులేని ఆవేదనలకు పరిష్కారం ఎక్కడ?

చాలీచాలని సంపాదనతో, ఆర్థికంగా సతమతమవుతూ, బతుకుదెరువు బహు కష్టంగా మారిన నేపథ్యంలో మధ్య తరగతి జీవితాలు అల్లకల్లోల సాగరాన్ని తలపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులనుండి కాపాడి, ఒడ్డుకు చేర్చే శాశ్వత పరిష్కారాలను అన్వేషించడం అత్యవసరం. సమాజంలో పలు వైరుధ్యాలు తాండవిస్తున్నాయి. అహంకారమే తప్ప ఆలోచనా శక్తిలేని నూతన తరం రూపుదిద్దుకుంటున్నది. తరాల మధ్య అంతరం పెరిగింది. అంతరంగ మథనం లోపించింది. 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ..' చందంగా మూర? భావజాలం, ఆధిక్యతా ధోరణి మానవ మస్తిష్కంలో తిష్ఠ వేసింది. స్వార్థం పరాకాష్ఠకు చేరింది. వంచనతో దర్జాగా బతికే వారు కొందరైతే, వ్యక్తిత్వంతో బతికలేక జీవశ్ఛవాల్లా జీవితాంతం మనోవేదనతో బతుకీడ్చేవారు మరికొందరు నేటి సమాజంలో అడుగడుగునా తారసపడతారు. తినడానికి తిండిలేక కొంతమంది విగతజీవులవుతుంటే, సకల సౌభాగ్యాలతో జీవిస్తూ, విలాసాల్లో తేలియాడుతూ ఏదో అసంతృప్తితో ఆత్మహత్యలకు పాల్పడేవారు మరికొందరు నేటి సమాజంలో మనకు అగుపిస్తున్నారు. యువశక్తి వ్యసనాలతో నిర్వీర్యమవుతున్నది. కలిమి కలత చెందుతున్నది. లేమి దిగులు చెందుతూ జీవనయానం సాగిస్తున్నది. ఒకవైపు మోదం, ఇంకోవైపు ఖేదం.. ఇదే సామాజిక వైపరీత్యం. అంబరాన్ని తాకే సంబరంతో ఆడంబరాలతో దిగంబరంగా మారుతున్న నూతన విన్యాసం ఒక వైపు... జానెడు పొట్ట నింపుకోలేక, కట్టుకోవడానికి సరైన గుడ్డలేక, ఉండడానికి సరైన గూడులేక అలమటించే అభాగ్యుల దీనగాథలు మరో వైపు మానవ జీవితం లోని అంతరాలను వెక్కిరిస్తున్నాయి. విందు వినోదాల ఉల్లాసాలు వికాసానికా? విలువల విధ్వంసానికా? ఇది ప్రగతికి బాటలు వేస్తున్నదా? బీటలు పెడుతున్నదా? ఒకవైపు మధ్య తరగతి జీవుల బతుకుల్లో హాలాహలం.. మరో వైపు బరువెక్కిన కరెన్సీని విలాసాలకు వెచ్చిస్తూ కాలయాపన చేస్తున్న యువతరం కోలాహలం. ఇది కలానికందని కల్లోలం. సగటు జీవుల బతుకుల్లోని వేదనలు కాలగర్భంలో దాగున్న కనబడని సుడిగుండాల వంటివి. కష్టాల సుడిగుండాలు బలపడి మృత్యు విహంగాలై జీవిత నావను తీరం దాటే తరుణంలో ప్రళయ ప్రభంజనమై ముంచేస్తున్నాయి. జీవన యానానికి ముగింపునిస్తున్న సన్నివేశాలు హృద్యం.. మరికొంతమందికి చోద్యం. కొందరి కంట కన్నీరు! కొందరి ఇంట సిరుల పన్నీరు! సేద్యంలో విలాపం.. స్వేదానికి దగ్గని ఫలితం. కొందరి స్వేదం మరికొందరికి కరెన్సీగా మారి, కొంత మంది ధనిక యువత చేతిలో ఖరీదైన మద్యం సీసాలా పరివర్తన చెంది వెక్కిరిస్తే ఇది సమాజ వికాసమా? విలాపమా? ఒక చెంత 'మందు'తో తనువు చాలిస్తున్న కర్షకుడు! మరోచెంత మందుతో గాంఢ్రిస్తున్న భోగలాలసుడు! విందు విలాసాలే జీవిత పరమార్థంగా కొందరు బతికేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి అతి దీనంగా మరికొందరు బతుకీడ్చుతున్నారు. విలాసాల వినువీధుల్లో ఊరేగి, ఆశించింది అందక తనువు చాలిస్తున్నారు ఇంకొందరు! బతకాలని ఉన్నా బతకనీయని బడబాగ్ని జ్వాలలు చుట్టుముడుతుంటే, గరళాన్ని మింగుతున్న సగటు జీవుల వెతలు వర్ణనాతీతం. దేశానికి 'ముద్ద' పెడుతూ, ముద్ద లేక గతిస్తున్న కర్షకజన చరిత్ర ఆద్యంతం అత్యంత బాధాకరం. విలాసాల్లో మునిగి ప్రేమ అంచుల దాకా పయనించి పతనమవుతున్న యువతరానికి ఉరితాళ్ళే శరణ్య మవుతుంటే, కష్టాలను భరించలేని కర్షకునికీ ఆ ఉరితాళ్ళే ఆలంబన అవుతున్నాయి. మధ్య తరగతి జీవుల ఆర్థిక బాధలకు ఆత్మహత్యలే ఆఖరి అవకాశంగా మారుతున్నాయి. అందరి గమ్యం ఒకటై వెక్కిరిస్తుంటే చోద్యం చూడడం తప్ప ఏమీ చేయలేక నిస్సహాయంగా విలపిస్తున్నాం. ఒకరిది అర్థవంతమైన ఆవేదన, మరొకరిది అర్థంలేని మనోవేదన. ఇరువురూ విషాద గేయానికి పల్లవులే. నిద్దురలేని రాత్రులలో ప్రపంచం వెక్కిరిస్తుంటే పలకలేని గేయానికి చరణాలే. స్వరం తప్పిన గీతికలే. బతుకు వేదంలో శృతిలేని నాదాలే. ఇద్దరిదీ ఒకటే గమ్యం.. అదే మరణం. విలాసాల మోజుకు బానిసలై కడకు 'మనీ' లేక మినీ జీవితం గడపలేమని బలవుతున్న బడాయి జీవుల బతుకు చిత్రం ఒకరిదైతే, అహరహం స్వేదం చిందించి, దక్కని ఫలితంతో తనువు చాలిస్తున్న దైన్య చరిత మరొకరిది. ఇదే ఇరువురి జీవితాలలో కానరాని సారూప్యం.. అడుగడుగునా వైరుధ్యం. ఆశించినది దక్కక ఒకరు. హృదయం బరువెక్కి బతకలేక తనువు చాలిస్తున్నది మరొకరు. అర్థవంతమైన జీవితాలకు ముగింపు మరణమా? అర్థంలేని వ్యర్థవాదుల మనుగడకు మార్గమా ? విలాసాల విహంగంలా తేలియాడుతూ, కోరికల గుర్రాన్నెక్కి ఊహల్లో భ్రమిస్తూ పరిభ్రమిస్తున్న యువత తన లక్ష్యం మరచి, మత్తులో చిత్తవడం హాస్యాస్పదం. జల్సాలకు మరిగి, కోరింది దొరకలేదనే ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు, ఒక్క క్షణం ఇతరుల జీవితాల్లో ఎదురవుతున్న సమస్యలను తొంగిచూస్తే వారి సమస్యల ముందు తమ సమస్యలు అర్థంలేని చిందరవందర గీతలుగా అగుపించక మానవు. అర్థవంతమైన జీవితాలకు ముగింపు మరణం కారాదు. జీవన తీరానికి దారులు ఆత్మహత్యలు కావనే సందేశం నిజం కావాలంటే ప్రస్తుత పరిస్థితులు మారాలి.

# ప్రజాసేవలో మేటి రారెవరూ ఆయనకు సాటి






రాజకీయాలలో రాణించడం అంత సులువేమీ కాదు. ప్రజలను నిత్యం అంటిపెట్టుకుని, వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజా సేవకు అంకితం అయినా, ప్రజాప్రతినిధులపై అసంతృప్తి ఉండడం అత్యంత సహజం. అందునా ఒక ప్రజాప్రతినిధి తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సెగ్మెంట్ ను కాకుండా, ఇతర నియోజక వర్గం నుండి గెలుపొందడం చాలా అరు దైన విషయమే. అలా మూడు నియోజక వర్గాల నుండి విజయం సాధించి రాష్ట్ర శాసనసభకు వెళ్ళిన అరుదైన నేతగా గుర్తింపు పొందారు వరంగల్ జిల్లాకు చెందిన హయగ్రీవాచారి. అంతే కాదు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పని చేసిన ఘనతను దక్కించుకున్న గొప్ప ప్రజా ప్రతినిధి ఆయన. వాస్తవంగా హయగ్రీవాచారి వరంగల్ జిల్లా ధర్మసాగర్ వాసి. ఆయన స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జనరల్‌గా ఉన్నప్పుడు అక్కడ ఒకసారి గెలిచారు. అలాగే ధర్మసాగర్ నుండి రెండు సార్లు, హన్మకొండ నుంచి ఒక సారి గెలిచారు. హయగ్రీవాచారి 1916 నవంబర్ 25 న ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. తిరునగరి శ్రీనివాసా చార్యులు అండాళమ్మ ఆయన తల్లిదండ్రులు. మూడవ తరగతి వరకు ధర్మసాగర్ లోని వీధి బడిలో చదివారు. కాంతంరాజు, రావుల నరసింహారెడ్డి వద్ద పెద్దబాలశిక్ష చదివారు. ఆ తరువాత వారి కుటుంబం హన్మకొండ పట్టణంలో స్థిరపడింది. ఆ రోజుల్లో హైదరా బాద్ సంస్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ఉన్నత పాఠశాల ఉండేది. ఉన్నత పాఠశాలల్లో చదివే రోజుల్లోనే హయగ్రీవాచారిపై జాతీయోద్యమ ప్రభావం తీవ్రంగా పడింది. 1932లో నిర్వహించిన కాకతీయ ఉత్సవాలు ఆనాటి యువకులను ఉత్సాహ పరిచాయి. ఎంతో మందిలో ఉత్తేజాన్ని నింపాయి. ఆ ఉత్సవాల నిర్వహణలో పర్సా రంగారావు, ఉదయ రాజుశిషగిరిరావు, ఆవంచ వెంకట్రావు, మాదిరాజు రామ కోటేశ్వర రావు, కాళోజీ రామేశ్వర రావులతో పాటు విద్యార్థి సేవాదళ బాధ్యునిగా హయగ్రీవాచారి పని చేశారు. 1935లో హయగ్రీవారి మెట్రిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్‌లో ప్రవేశించారు. హైదరాబాద్ చేరి చదువు మధ్యలోనే ఆపేశారు. ఆ తర్వాత ఆయన పూర్తి జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారు. వరంగల్లు అయ్యగారుగా ఆయన సుపరిచితులు. నిజాం వ్యతిరేక పోరాటం లో ప్రముఖ పాత్ర ఆయనది. స్వాతంత్రోద్యమంలో వరంగల్ నుంచి ఎదిగిన తొలితరం కాంగ్రెస్ నాయకుల్లో ఆయనొకరు. రాజకీయ సామాజిక రంగాల్లో ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆయన తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా స్వామి రామానందతీర్థ నాయకత్వంలో పోరాటం సాగించిన కొద్దిమంది నాయకులలో ఆయన ఒకరు. ఆయనే తిరునగరి హయ గ్రీవాచారి. హైదరాబాద్ హిందీ ప్రచార సభ అధ్యక్షుడిగా, హిందీ ప్రతిష్టాన్ వ్యవస్థాపకులుగా హిందీ భాషకు ఆయన చేసిన సేవ ఎంతో గొప్పది. వరంగల్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించ డానికి హయగ్రీవాచా రి ఎంతో శ్రమించారు. ఆయన కృషి ఫలితం గానే వరంగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. వయోజన ఓటింగ్ పద్ధతపై ఎన్నికైన వరంగల్ పురపాలక సంఘ తొలి అధ్యక్షుడిగా హయగ్రీవాచారి ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యానంతరం ఆయన చేపట్టిన తొలిపదవిగా, వరంగల్ పురపాలక సంఘం తొలి అధ్యకుడిగా పని చేశారు. హయగ్రీవాచారి అవిభాజ్య వరంగల్ జిల్లా నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, నలుగురు సీఎంల మంత్రివర్గంలో సభ్యుడిగా పనిచేశారు. 1972 నుంచి ఆయన మంత్రిగా పనిచేశారు. పీవీ నర్సింహారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, టంగుటూరు అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి మంత్రి వర్గాలలో ఆయన పనిచేశారు. ఆయన నిర్వహించిన పదవులను సమర్థవంతంగా చేశారనే పేరును సంపాదించుకున్నారు. పంచాయతీరాజ్, సాంకేతిక విద్య మొదలైన శాఖలను ఆయన నిర్వహించిన కాలంలో ఆయా శాఖలను సమర్థ వంతంగా నిర్వహించారని ఆయన పేరు తెచ్చుకున్నారు. 1962 శాసనసభ ఎన్నికలలో ధర్మసాగర్ నియోజకవర్గం నుండి, 1972 శాసనసభ ఎన్నికలలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుండి, 1978 శాసనసభ ఎన్నికలలో హనమ కొండ నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నిక య్యారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షుడిగా కూడా ఇతడు కొంతకాలం ఉన్నారు. 1950-52లో వరంగల్ జిల్లా పారిశ్రామిక సలహా మండలి సభ్యులుగా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. సహకార ఉద్యమ వ్యాప్తి లోనూ, బలహీన వర్గాల పురోగతి లోనూ అయ్యగారి అసాధారణమైందని చెపుతుంటారు. హయగ్రీవా చారిని "అయ్యగారు" అని ముద్దుగా పిలుచుకునేవారు. ఆయన చేపట్టిన అనేక పదవుల ద్వారా అంది వచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. వరంగల్ పురపాలక సంఘం ప్రథమ చైర్మన్‌గా, మంత్రిగా పని చేస్తూ విభిన్న వర్గాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలు నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ప్రత్యేక పాత్ర పోషించారని ఆయన అభిమాన కాంగ్రెస్ నాయకులు హయగ్రీవాచారి చేసిన సేవల్ని ఎల్లపుడూ గుర్తుచేసుకుంటారు. వరంగల్ జిల్లాలో వివిధ స్థాయిలో వివిధ అంశాలపై మహాసభలు నిర్వహించడంలో ఆయన పాత్ర కృషి చెప్పుకోదగింది. వరంగల్ పట్టణానికి పోచంపాడు నీళ్లు తీసుకువచ్చి వరంగల్, హన్మకొండ, కాజీపేట పట్టణాలలో మంచినీటి కొరత తీర్చటంలో హయగ్రీవాచారి ఎంతో కృషి చేశారని ఆయనకు పేరుంది. వరంగల్ జిల్లా బోర్డు వైస్ చైర్మనగా హయగ్రీవాచారి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకుంటారు. హయగ్రీవాచారి 1991, డిసెంబర్ 5వ తేదీన పీపుల్స్ వార్ గ్రూపు నక్సలైట్లచే హనుమకొండలోని స్వంత ఇంటిలో హత మార్చబడ్డారు.

# 'సుస్థిరాభివృద్ధి' సిద్ధాంతము- ఆచరణ



సుస్థిరాభివృద్ధి అనేది ఆధునిక ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశమైన భావన. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకు సంబంధించినది మాత్రమే కాదు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాలను సమతుల్యంగా కలిపి, ప్రస్తుత తరం అవసరాలను తీర్చుతూ భవిష్యత్ తరాలకు అవకాశాలను కాపాడుకోవడం. బ్రండ్‌లాండ్ కమిషన్ నివేదికలో మొదటిసారి స్పష్టంగా నిర్వచించబడిన ఈ భావన, ఇప్పుడు ఐక్యరాష్ట్ర సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్.డీ.జీ.ఎస్.) రూపంలో ప్రపంచవ్యాప్తంగా అమలవుతోంది. అయితే, ఈ భావన యొక్క లక్షణాలు మరియు వ్యూహాలను విశ్లేషించి, విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, ఇది ఒక ఆదర్శవాద దృక్పథం మాత్రమే కాకుండా, వాస్తవిక సవాళ్లతో కూడిన సంక్లిష్ట ప్రక్రియగా తెలుస్తుంది. మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉంటాయి. అవి ఆర్థిక, సామాజిక అలాగే పర్యావరణ సంబంధిత అంశాలు. ఆర్థిక స్తంభం సమర్థవంతమైన వనరుల వినియోగం, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధిని నొక్కి చెబుతుంది. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి, పేదరిక నిర్మూలనను సమన్వయం చేయడం ద్వారా, దేశాలు దీర్ఘకాలిక సమృద్ధిని సాధించవచ్చు. సామాజిక స్తంభం సమానత్వం, విద్య, ఆరోగ్యంతోపాటు... మానవ హక్కులను ప్రోత్సహిస్తుంది. ఇది సమాజంలో అసమానతలను తగ్గించడానికి ఉద్దేశించబడింది. పర్యావరణ స్తంభం జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు, వనరుల పునరుద్ధరణపై దృష్టిని సారిస్తుంది. ఈ మూడు స్తంభాలు పరస్పరం అనుసంధానితమై ఉండటం ఈ భావన యొక్క ప్రత్యేకత. అయితే, విశ్లేషణాత్మకంగా చూస్తే, ఈ లక్షణాలు ఆచరణలో సంఘర్షణలు సృష్టిస్తాయి. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి కోసం పారిశ్రామికీకరణ అవసరం అవుతుంది. అయితే పారిశ్రామీకరణ పర్యావరణానికి హాని కలిగిస్తుంది. అలాగే, సామాజిక సమానత్వం కోసం ప్రయత్నాలు ఆర్థిక ఖర్చులను పెంచుతాయి. ఇది సుస్థిరత యొక్క ఆదర్శవాద స్వభావాన్ని ప్రశ్నిస్తుంది %-%ఈ సుస్థిరాభివృ నిజంగా సాధ్యమా, లేదా కేవలం రాజకీయ రెటారిక్ మాత్రమేనా? ఇక వ్యూహాల విషయానికి వస్తే, సుస్థిరాభివృద్ధిని సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యూహాలు అమలవుతున్నాయి. ముందుగా, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం. సౌర, పవన, జలవిద్యుత్ వంటివి,కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి కీలక పాత్ర పోషిస్తుంది. యూరోపియన్ యూనియన్ యొక్క గ్రీన్ డీల్ వంటి కార్యక్రమాలు ఈ వ్యూహాన్ని ఉదాహరణగా చూపుతాయి. రెండవది, సర్క్యులర్ ఎకానమీ మోడల్, ఇక్కడ వ్యర్థాలను పునర్వినియోగం చేసి, వనరులను ఆదా చేస్తారు. ఇది సాంప్రదాయ లీనియర్ ఎకానమీ (తయారు-వినియోగం-విస్మరణ) నుండి మార్పును సూచిస్తుంది. మూడవది, సుస్థిర వ్యవసాయం. ఆర్గానిక్ ఫార్మింగ్, నీటిని సమర్థ వంతంగా వినియోగం, జీవవైవిధ్య పరిరక్షణ, ఆహార భద్రతను బలోపేతం చేయటం మొదలైన కార్యక్రమాలు ఉంటాయి. అదనంగా, విద్య,వికాస అవగాహన కార్యక్రమాలు, పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లు వంటివి సమాజాన్ని సుస్థిరత వైపు నడిపిస్తాయి. ఐక్యరాష్ట్ర సమితి యొక్క 17 (ఎస్.డీ.జీ.ఎస్) పేదరిక నిర్మూలన నుండి వాతావరణ పరిరక్షణ చర్య వరకు... ఈ వ్యూహాలకు మార్గదర్శకాలుగా ఉంటాయి. విశ్లేషణాత్మకంగా, ఈ వ్యూహాలు సమస్యలను పరిష్కరించడంలో సమర్థవంతమైనవి కావచ్చు. కానీ, అవి దేశాల మధ్య అసమానతలను పరిగణనలోకి తీసుకోవు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక వృద్ధి కోసం పర్యావరణాన్ని త్యాగం చేయవలసి వస్తుంది, ఇది సుస్థిరత యొక్క సార్వత్రికతను ప్రశ్నిస్తుంది. విమర్శనాత్మక దృక్పథంతో చూస్తే, సుస్థిరాభివృద్ధి లక్షణాలు,వాటి వ్యూహాలు అనేక లోపాలతో కూడి ఉన్నాయి. ముందుగా, (ఎస్.డీ.జీ.ఎస్.) లో అంతర్గత అసంగతతలు ఆర్థిక వృద్ధి (ఎస్.డీ.జీ.- 8) మరియు పర్యావరణ పరిరక్షణ (ఎస్.డీ.జీ.-13) మధ్య సంఘర్షణ అమలును కష్టతరం చేస్తున్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం, ఈ లక్ష్యాలు సామాజిక, ఆర్థిక, పర్యావరణ స్తంభాల మధ్య సమతుల్యతలు లోపిస్తాయి. ఇది ప్రపంచ దేశాలలో అసమాన ప్రగతిని కలిగిస్తుంది. ఉదాహరణకు, చైనా,ఇండియా వంటి దేశాలు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా సుస్థిరతను ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవంలో పర్యావరణ హాని,అలాగే రుణ ఉచ్చులు పెరుగుతున్నాయి. రెండవది, గ్రీన్‌వాషింగ్, కంపెనీలు తమ ఉత్పత్తులను సుస్థిరంగా చూపించి, వాస్తవంలో పర్యావరణాన్ని దోపిడీ చేయడం మొదలు పెట్టాయి. ఈ భావనను బలహీనపరుస్తుంది. కార్పొరేట్ లాబీయింగ్.. రాజకీయ ఇచ్ఛా శక్తి లోపం కారణంగా, వ్యూహాలు కేవలం కాగితంపైనే మిగిలిపోతాయి. మూడవది, డేటా సవాళ్లు కూడా సుస్థిరత పనితీరును కొలవడంలో ఖచ్చితత్వం లోపించటం జరుగుతుంది. ప్రత్యేకించి వాతావరణ మార్పులు, అలాగే అసమానతల విషయంలో. ఒక అధ్యయనం ప్రకారం, ఈ డేటా లోపాలు నిజమైన ప్రగతిని మూల్యాంకనం చేయటంలో ఇబ్బందులు కలగజేస్తాయి. అంతేకాకుండా, అభివృద్ధి చెందిన దేశాలు తమ బాధ్యతలను అభివృద్ధి చెందుతున్న దేశాలపై నెట్టడం ఒక రివాజుగా మారింది. సుస్థిరత అనేదో ఒక ఉత్తర-దక్షిణ వివాదంగా మారుతుంది. ఉదాహరణకు, పారిస్ ఒప్పందం ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలు అభివృద్ధి చెందిన దేశాలకు సులభమైనవి కావచ్చు. కానీ, భారత్ వంటి అభివృద్ధి చెందే దేశాలకు ఆర్థిక భారం అవుతుంది. ఈ విమర్శలు సుస్థిరాభివృద్ధిని ఒక ఆదర్శవాద భ్రమగా, చేరుకోలేని లక్ష్యాలుగా చూపుతాయి. ఇక్కడ వాస్తవిక రాజకీయ, ఆర్థిక శక్తులు ఆధిపత్యం చేస్తాయి. అయినప్పటికీ, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, వ్యూహాలు పూర్తిగా విఫలమైనవిగా భావించి లేము. విశ్లేషణాత్మకంగా పరిశీలించి చూస్తే, మల్టీ-మెట్రిక్ ఫ్రేమ్‌వర్క్‌లు, సిస్టమ్ డైనమిక్స్ వంటి పద్ధతులు ఈ సవాళ్లను పరిష్కరించడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ మోడల్స్ ద్వారా, దేశాలు తమ వ్యూహాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చవచ్చు. కానీ ఇది రాజకీయ ఇచ్ఛా శక్తి అలాగే అంతర్జాతీయ సహకారంపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్‌లో, సుస్థిరతను మరింత సమగ్రంగా చేయడానికి, డేటా ఆధారిత విశ్లేషణలు మరియు మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎం.సీ.డీ.ఎమ్.) వంటి సాధనాలు అవసరం ఉంటుంది. ఇది సుస్థిరాభివృద్ధిని కేవలం లక్ష్యాల సమూహం నుండి ఒక డైనమిక్ ప్రక్రియగా మారుస్తుంది. అయితే, ఇప్పటికీ, ఈ భావన యొక్క స్వరూ పం, స్వభావాలను విమర్శనాత్మకంగా పరిశీలన చేయటం అవసరం. ఇది నిజమైన మార్పును తీసుకురావాలంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తి అసమానతలను సవాలు చేయాలి. చివరిగా, సుస్థిరాభివృద్ధి ఒక అవసరమైన దృక్పథం, కానీ దాని లక్షణాలు మరియు వ్యూహాలు వాస్తవిక ఆచరణలో విమర్శలతో మెరుగుపరచాలి. లేకుంటే, ఇది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది.

# 61 రోజులు శుభకార్యాలకు బ్రేక్



**హైదరాబాద్ :** పెళ్లికాని ప్రసాద్‌లకు బ్యాడ్ న్యూస్.. చాలా మంది పెళ్లెప్పుడు అంటే ఏడాది ఆఖరి మాసంలో చేసుకుంటున్నా అంటూ కొంతమంది.. వచ్చే ఏడాది మొదటి నెలలోనే పెళ్లి బాజా పెట్టేస్తా అని మరికొంత మంది చెప్పు కొస్తుంటారు.. అలా చెప్పేవారికి, ఏడాది ఆఖరి మాసంలో, ఏడాది మొదటి మాసంలో వివాహాలు చేసుకునేవారికి ఇది బ్యాడ్ న్యూస్ ...హైందవ సంప్రదాయాల్లో ముహూర్తానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. ముహూర్తం నిర్ణయించనిదే ఎటువంటి శుభకార్యక్రమాలకు పూనుకోరు.. తాము తలపెట్టిన పని అంతా సజావుగా, సంతృప్తిగా జరగాలంటే ముహూర్తం చాలా ముఖ్యం అంటుంటారు.. అందుకే ప్రతీ శుభకార్యక్రమాలకు ముహూర్తానికి అంతటి ప్రాధాన్యతనిస్తారు.. సాధారణంగా శుభకార్యాలు నిర్వహించాలంటే గురు బలం బాగా ఉండాలి. అలాగే సిరిసంపదలు, సంతోషాలకు శుక్ర బలం ఎక్కువగా ఉండాలి. అయితే మూఢమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనంగా తేజస్సు కోల్పోయి ఉంటాయి.. కాబట్టి ఎలాంటి శుభకార్యాలు నిర్వహించకూడదు అంటుంటారు..అందుకే ఈ మూఢమి ఉన్ననాళ్లూ ఎటువంటి శుభకార్యాలకు పూను కోరు... అందుకే మీ అబ్బాయి పెళ్లెప్పుడు అని గనుక అంటే శూన్య మాసం కదండీ.. మూఢం వెళ్లాక ముహూర్తాలు పెట్టేస్తాం అంటుంటారు..మూఢమి అంటే శూన్యం లేదా చీకటి అని అర్థం. గురుడు లేదా శుక్రుడు సూర్యుడితో కలిసి ఉండే కాలాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో ఆయా ప్రాంతాలను బట్టి మూఢమి లేదా మూఢం అని అంటుంటారు. నవగ్రహాల్లోని గురుడు, శుక్రుడు గమనం చేస్తున్న క్రమంలో సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు అవి తమ కాంతిని కోల్పోవడం ద్వారా చీకటి లేదా మూఢమి సంభవిస్తుంది. దీనినే శూన్యం అనికూడా అంటుంటారు.. ఇంకా వివరంగా చెప్పాలంటే సౌర కుటుంబానికి సూర్యుడు పెద్దగా చెబుతారు. సూర్యుడి శక్తి, కాంతి అనంతం. అలాగే గురుడు, శుక్రుడు ఇవి రెండూ శుభ గ్రహాలు. ఈ శుభ గ్రహాలు మూఢమి సమయంలో తమ తేజస్సును కోల్పోవడం వల్ల.. చీకటి రోజులుగా భావించి శుభకార్యాలను వాయిదా వేస్తుంటారు. అందుకే ఈ మూఢమి ఉన్నన్ని రోజుల్లో ఎలాంటి శుభకార్యాలు చేయరు. ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి శుక్ర మౌఢ్యమి (గురుడు, శుక్రుడు అస్తంగత్వం) ఏర్పడనుందని పండితులు చెబుతున్నారు. అంటే డిసెంబర్ ఎనిమిది నుంచి 2026 ఫిబ్రవరి 6 వ తేదీ వరకు ఈ శుక్ర మౌఢ్యమి కొనసాగుతుంది. అంటే సుమారు 61 రోజుల పాటు ఈ మూఢం ఉండనుంది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం మార్గశిర బహుళ చవితి నుంచి మాఘమాసం బహుళ పంచమి వరకు ఈ శుక్ర మౌఢ్యమి కొనసాగుతుంది.. ఈ శుక్ర మౌఢ్యమి లో వివిధ పంచాంగాల్లో గణితాలలో తేడా వల్ల సూర్య గమనానికి దగ్గరగా గురుడు గాని శుక్రుడు గాని రావడం మూలంగా శుక్ర మౌఢ్యమి గాని గురు మౌఢ్యమి గాని ఏర్పడుతుంది. కొంతమంది 12 డిగ్రీలు గాను కొంతమంది 10 డిగ్రీలు గాను కొంతమంది 8 డిగ్రీలు గాను గ్రహించడం వల్ల ఈ తేదీలలో తేడాలు వస్తున్నాయి. కచ్చితంగా భారత ప్రభుత్వ ఆమోదిత దృక్ గణితము గ్రహించడం శాస్త్ర సమ్మతము..కనుక ఈ శుక్ర మౌఢ్యమిలో వివిధ పంచాంగాల్లో వివిధ రకాలుగా డేట్లు రావడం జరిగిందంటున్నారు. ఈ మూఢమి సమయంలో పెళ్లిచూపులు, నిశ్చితార్థం, వివాహం, ఉపనయనం, నూతన గృహప్రవేశం, యజ్ఞాలు, దేవతా విగ్రహ ప్రతిష్ఠలు, వాహనం, ఇల్లు వంటివి కొనడం, బోర్లు వేయించడం, పుట్టువెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం, కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, తీర్థయాత్రలకు వెళ్లడం,కొత్త ప్రయాణాలు ప్రారంభించడం, పదవీ ప్రమాణ స్వీకారం వంటివి చేయకూడదని పండితులు చెబుతున్నారు.మూఢమి ఉన్నా యథాతథంగా జరుపుకునే వాటిలో సీమంతం, నూతన వస్త్రాలంకరణ వంటి వాటికి ఈ మూఢమి వర్తించదు. ఈ కార్యక్రమాలకు నమ్మకమైన పండితులను సంప్రదించి నిర్వహించుకోవచ్చంటున్నారు పండితులు. అలాగే కొన్ని అనివార్యమైన, నిత్య కర్మలకు ఈ మూఢమి దోషం వర్తించదు. వాటిలో ప్రధానంగా రోజువారీ ప్రయాణాలు, నిత్యపూజ, అభిషేకం, నవగ్రహ శాంతి, సీమంతం, నామకరణం, అన్నప్రాశన వంటి కార్యక్రమాలు, చాతుర్మాస్య వ్రతాలు వంటివి ఈ శుక్ర మౌఢ్యమి రోజుల్లో వచ్చినా కూడా నిరభ్యంతరంగా చేసుకోవచ్చంటున్నారు.

# పోలీస్ వెబ్ సైట్ హ్యాక్

**హైదరాబాద్ :** బెట్టింగ్ యాప్స్‌పై యుద్ధం ప్రకటించి చర్యలు తీసుకుంటున్న తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు సవాల్‌గా మారారు. ఏకంగా పోలీస్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి అందులోనే బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు. నెటిజన్లు, అవసరమైన వ్యక్తులు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి ఏదైనా విభాగంపై క్లిక్ చేస్తే వెంటనే అది బెట్టింగ్ వెబ్‌సైట్‌లకు రీడైరెక్ట్ అయ్యింది. వెంటనే సమస్యను గుర్తించిన సైబర్ వింగ్ చర్యలు చేపట్టింది. సమస్యను పరిష్కరించింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులో ఏ విభాగంపై క్లిక్ చేసినా నేరుగా బెట్టింగ్ సైట్‌లకు రీ డైరెక్ట్ అయ్యేలా చేశారు. మెయిన్ వెబ్‌సైట్ ఆధారంగా మిగతా వెబ్‌సైట్‌లను కూడా నేరగాళ్ల తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ పరిధిలోని పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లు సరిగా పని చేయడం లేదు. టెక్నికల్ టీం దీన్ని రెక్టిఫై చేయడానికి ప్రయత్నించింది.




ఇంతలో సైబర్ నేరగాళ్లు తమ టాలెంట్ చూపించారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే నేరుగా బెట్టింగ్ సైట్‌లు ఓపెన్ అవుతున్నాయి. వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఐటీ విభాగం వెంటనే చర్యలు ప్రారంభించింది. సర్వర్ నుంచి వెబ్‌సైట్ ను హ్యాక్ చేశారని గుర్తించారు. అందుకే మెయిన్ సర్వర్‌ను డౌన్ చేసి సమస్యను పరిష్కరించారు. తర్వాత వెబ్‌సైట్‌లను పునరుద్ధరించారు. అందులో ఉన్న భద్రతా లోపాలను కూడా సవరించారు. పోలీస్ వెబ్‌సైట్ హ్యాక్, ఇతర వెబ్‌సైట్‌లలో బెట్టింగ్ యాప్స్‌వెబ్‌సైటలకు రీడైరెక్ట్ అవ్వడంపై పోలీసులు ఇంత వరకు స్పందించలేదు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. చాలా కాలంగా బెట్టింగ్ యాప్స్‌పై తెలంగాణ పోలీసులు విచారణ చేస్తున్నారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని పిలిచి విచారిస్తున్నారు. ఈ బెట్టింగ్ యాప్స్ వలలో పడిన అమాయకులు ప్రాణాలు తీసుకుంటున్నారని గ్రహించి పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది. ఇప్పుడు వారి వెబ్‌సైట్‌నే హ్యాక్ చేసి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి సైబర్ నేరగాళ్లు వారికి సవాల్ చేశారు. దీనిపై పోలీస్ శాఖ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# సీఎంవోలో ఇంటి దొంగలు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వంలో అత్యంత కీలక నిర్ణయాలు ముందుగానే బీఆర్‌ఎస్ పార్టీకి చేరుతున్నాయి. చాలా రోజుల నుంచి ప్రభుత్వ పెద్దలకు ఈ అంశంపై అనుమానాలు ఉన్నా.. హిల్ట్ పాలసీ గురించి పూర్తి స్థాయిలో కేబినెట్‌కు కూడా వివరాలు తెలియక ముందే.. బీఆర్‌ఎస్‌కు తెలిసిపోవడంతో కోవర్ట్ చాలా ఉన్నత స్థాయిలోనే ఉన్నారని క్లారిటీ వచ్చింది. ఈ అంశంపై విజిలెన్స్ దర్యాప్తు చేసిది. నివేదికను సిద్ధం చేసింది. ఆ నివేదికను సీఎం వద్ద ఉంచారు చీఫ్ సెక్రటరీ.హిల్ట్ పాలసీ గురించి ప్రభుత్వం చాలా అత్యున్నత స్థాయిలో కసరత్తు చేసింది. కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాలనుకునేవరకూ మంత్రులకు కూడా తెలియదు. విధివిధానాలు అన్నీ కసరత్తు చేసి డ్రాఫ్ట్ గా నోట్ తయారు చేసుకున్నారు. అయితే ఆ దశలోనే బీఆర్‌ఎస్ వద్దకు సమాచారం చేరిపోయింది. ప్రభుత్వం ఎవరికీ తెలియదను కుంటున్న సమయంలోనే హిల్ట్ పాలసీ గురించి కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టి ఐదు లక్షల కోట్ల స్కాం అని ఆరోపణలు చేశారు. దీంతో ఆశ్చర్యపోవడం ప్రభుత్వ పెద్దల వంతు అయింది. అనుకున్నంత తేలికగా రాజకీయం లేదని తమ వద్దనే బీఆర్‌ఎస్ కోవర్టులు ఉన్నారని గుర్తించారు. అసలు కోవర్ట్ ఎవరో కాంగ్రెస్ పెద్దలకు తెలిసిపోయిందని చెబుతున్నారు. ఆయనను సీఎం రేవంత్ రెడ్డి ఎంతో నమ్మారని చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టుగా ఉన్న ఆయన సిన్సియారిటీని రేవంత్ నమ్మారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటి జిల్లా నుంచి వచ్చిన ఆయనకు నామినేటెడ్ పదవిని చాలా ముందుగానే ప్రకటించారు. సీఎంతో నిత్యం సమావేశాల్లో పాల్గొనేంత కీలక పదవి ఇచ్చారు. తర్వాత రాజ్యాంగబద్ధమైన పదవి ఇచ్చారు. పదవి ఏదైనా తనకు ఉన్న చనువుతో కీలక విషయాలను తెలుసుకునేవారు . వాటిని గుట్టుచప్పుడు కాకుండా.. బీఆర్‌ఎస్ పార్టీ పెద్దలకు పంపుతున్నారు. హిల్ట్ పాలసీ కి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ఇలా ఫార్వార్డ్ అయ్యాయని చెబుతున్నారు. కేటీఆర్ వాటిని చూపించే ముందే ప్రెస్ మీట్ పెట్టారు.సాధారణంగా అధికారుల స్థాయిలో సమాచారం లీక్ అవుతుంది. కానీ అధికారులు ఎలాంటి డాక్యుమెంట్లు ఫార్వార్డ్ చేయరు. అలాంటి రిస్క్ తీసుకోలేరు. నోటిమాటగా సమాచారం ఇవ్వగలరు. కానీ హిల్ట్ పాలసీ విషయంలో డాక్యుమెంట్లు కూడా బీఆర్‌ఎస్ ముఖ్యనేతలకు షేర్ అయ్యాయని విజిలెన్స్ గుర్తించింది. ఆయన ఎవరో కూడా కనిపెట్టారు. ప్రభుత్వం ఏర్పడగానే ఆయనకు మీడియా విభాగంలో కీలక బాధ్యతలు ఇచ్చారు. తర్వాత రాజ్యాంగ బద్ధమైన పదవి కూడా ఇచ్చారు. ఆయన వివిధ పాలసీల విషయంలో మీడియాతో డీల్ చేయాల్సిన వ్యూహాలను ఖరారు చేస్తున్నారని అంటున్నారు. ఆయన నుంచే లీక్ అయిందని..సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఆయన పూర్తిగా వమ్ము చేశాడని అంటున్నారు. ఇది చిన్న విషయం కాదు.అయితే రేవంత్ చాలా నమ్మకం పెట్టుకున్న ఆయన ఇలా బీఆర్‌ఎస్ పార్టీతో ఎందుకు కుమ్మక్కయ్యారని.రేవంత్ కు ఎందుకు ద్రోహం చేశారన్నది హైలెవల్‌లో జరుగుతున్న చర్చ. దీనికి కూడా కారణాలు ఉన్నాయని అంటున్నారు. డబ్బుతో పాటు హనీట్రాప్ బారిన పడ్డారని.. బ్లాక్ మెయిల్ కారణంగానే ఇలా కోవర్టుగా మారారని అంటున్నారు. ఆయన ఎవరో.. ఇప్పటికే కొంత మందికి స్పష్టత వచ్చింది. రేవంత్‌కూ తెలిసిపోయి ఉంటుంది. ఆయన తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. ఇది నమ్మకద్రోహం కావడంతో.. క్షమించే అవకాశాలు ఉండవని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వానికి సమాచార గోప్యత చాలా ముఖ్యం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పకపోతే చాలా అపోహలు వస్తాయి. ప్రస్తుతం హిల్ట్ పాలసీ గురించే



తీసుకుంటే...అసలు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకముందే.. బీఆర్‌ఎస్ పార్టీ... స్కాం పేరుతో పెద్ద ఎత్తున ఆరోపణలు చేసింది. అవే ప్రజల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వం తన వాదనను బలంగా చెప్పలేకపోతోంది. దీనికి కారణం ఈ లీకేజీనే. ఇలాంటివి గతంలోనూ జరిగాయి కానీ ప్రభుత్వం సీరియస్ గా తీసుకోలేపోయింది. అసలు ఎవరు సమాచారాన్ని లీక్ చేస్తున్నారో మాత్రం గుర్తించలేకపోయారు. ఫలితంగా ఇప్పుడు తీవ్రంగా చిక్కుల్లో పడాల్సి వస్తోంది. ప్రభుత్వంలో కీలక పొజిషన్లలో అత్యంత నమ్మకస్తులైన వారే ఉంటారు. వారు ఎంత నమ్మకంగా ఉండాలంటే.. ప్రాణం పోయినా సమాచారం బయట పెట్టకూడదు. అలా పెట్టేవారు ఉన్నారంటే.. ముఖ్యమంత్రి ప్రభుత్వంపై పట్టు సాధించలేదని అనుకుంటారు. అందుకే ప్రస్తుతం.. కోవర్టుగా గుర్తించిన కీలక వ్యక్తి విషయంలో ప్రభుత్వం కిందా మీదా పడుతుంది. ఎలాంటి కారణం అయినా సరే.. ఇలాంటి పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

## మన సంస్కృతిలో చేనేత వృత్తులు ప్రధాన భూమిక పోషిస్తాయి

**హైదరాబాద్ :** మన చేనేత కళలను మనం పరిరక్షించుకోవాలని, భారతీయ సంస్కృతిలో చేనేత వృత్తులు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలంగాణా హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. గలశ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్ ను ఆమె ప్రారంభించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలోని చీరలు కళాత్మక నైపుణ్యానికి, నాణ్యమైన పట్టు ఉత్పత్తులకు వేదికగా నిలుస్తాయని అన్నారు. దేశంలో 14 రాష్ట్రాలకు చెందిన చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఇక్కడి చీరలు మహిళలకు ఆకట్టుకుంటాయని, చేనేతకారులకు ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని, ఇండియన్ సిల్యాలరీలో చీరలను మహిళలు సందర్శించి చేనేతకారుల పనితీరును తిలకించాలని కోరారు. దేశంలోని అన్నిప్రాంతాల చేనేతకారులకు ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ లను ప్రశంశించారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి, పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, బెనారస్, కొలకతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్లో ఏర్పాటుచేశామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ సహకారంతో చేనేతకారుల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్ లో 80 స్టాల్స్ వినియోగదారులకు ఈనెల 10వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## కాటేదాన్‌లో బీఆర్ఎస్ నేతల పర్యటన

**రంగారెడ్డి :** రాజేంద్రనగర్ పరిధి కాటేదాన్ పారిశ్రా మికవాడలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మంచి రెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డిలు పర్యటించారు. కార్మికులతో ముఖా ముఖి అయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ చట్టంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. పారిశ్రామిక భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని అన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజును 30 శాతం చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామనడం దుర్మార్గమైన చర్య. హైదరాబాద్‌లో ఉన్న22 పారిశ్రామికవాడలలో ఉన్న సుమారు 9000 ఎకరాల భూముల మార్పుకు తెచ్చిన 27 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. వెంటనే ఈ చర్యలు అపకపోతే పేద్ద ఎత్తున ధర్నాలు చేపట్టి ఉద్యమిస్తమని హెచ్చరించారు.

## మూడు కోట్లు వసూలు చేసి దంపతులు పరారీ

**మేడ్చల్ :** ఉప్పల్ పిఎస్ పరిధి చిలకానగర్ కుమ్మరికుంటలో అధిక వడ్డీ ఆశ చూపి 10% వడ్డీ ఇస్తామని 3కోట్ల రూపాయలు వసూలు చేసి దంపతులు సురేష్, శాంతి పరారయ్యారు. చిలకానగర్ కుమ్మరికుంట గత 10సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉండే సురేష్, శాంతి దంపతులు నివాసం ఉన్నారు. దంపతులు ఇద్దరు చుట్టుపక్కల వారితో పరిచయం పెంచుకొని, అధిక వడ్డీల ఆశచూపి, చిట్టీల పేరుతో స్థానికుల నుంచి సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారు. అద్దె ఇంటికి తాళం పెట్టి దంపతులు ఇద్దరు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి, పరారైయారు. మోసపోయినట్లు గుర్తించిన భాధితులు ఉప్పల్ పోలీసులకు అక్టోబర్ 22, 2025నఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


## వరద నీటికాలువ పనులు ప్రారంభించిన కార్పోరేటర్ శ్వేత

**హైదరాబాద్ :** ఐదేళ్ల కాలంలో ఐ ఎస్ సదన్ డివిజన్ లోసుమారు రూ.20 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చెప్పట్టినట్లు కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి తెలిపారు. కృష్ణా నగర్ లో వరద నీటి కాలువ పనులను ఆమె ప్రారంభించారు. జీహెచ్ ఎంసీ అధికారులు సహకరించకున్న కొట్లాడి నిధులు సాధించామని అన్నారు.గ్రేటర్ లో డివిజనును మోడల్ గా తయారు చేసేందుకు కృషి చేశానని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమర్నాథ్ రెడ్డి.రేణుక ముదిరాజ్ పాల్గొన్నారు

## లవర్ చనిపోయాడని... సూసైడ్

**మెదక్ :** ఇటీవల ప్రేమ జంటల ఆత్మహత్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. టీనేజ్ ప్రేమలను పెద్దలు ఒప్పుకోకపోవడమో.. పెళ్లికి నిరాకరించడమో.. కారణమేదైనా ఒకరిని విడిచి మరొకరు ఉండలేక రెండు పదుల వయస్సు దాటకుండానే దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. నిలువునా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా సిద్దిపేట జిల్లాలో ప్రియుడు అనారోగ్యంతో చనిపోగా నువ్వులేని జీవితం నాకు వద్దు అని ఓ ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించిన వ్యక్తి మృతి చెందాడని మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్ది పేట జిల్లా కుకునూ రుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే కుకునూరుపల్లి గ్రామానికి చెందిన ఆశని శంకర్ మేస్త్రీగా పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు..శంకర్ కు ఒక కుమారుడు, కుమార్తె ఆశని శ్రావణి(18) ఉన్నారు.శ్రావణి ఇంటర్ పూర్తిచేసి ఇంటి దగ్గరే ఉంటూ కూలీ పనులకు వెళ్తుంది. శంకర్ తన కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్య,కుటుంబ సమస్యలు ఉండటంతో దౌల్తాబాద్ మండలం మల్లేశం పల్లికి చెందిన కుమ్మరి మహేష్ అలియాస్ రహీమ్ బాబా వద్దకు వెళ్లేవారు. ఈ క్రమంలో శ్రావణికి అక్కడ మహేష్‌తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఇటీవల నాలుగు రోజుల క్రితం మహేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శ్రావణి సరిగ్గా ఇంట్లో తినకపోవడాన్ని గమనించిన కుటుంబసభ్యులు శ్రావణిని అడగగా మహేష్‌ని ప్రేమించానని.. అతన్ని పెళ్లి చేసుకోవాలనుకున్నానని తెలిపింది. అంతలోనే మహేష్ మృతి చెందాడని మనస్థాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రావణి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రావణి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఆమె మృతితో శ్రావణి కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయింది.

## పొంగులేటి కంపెనీపై ఎఫ్ ఐఆర్



**హైదరాబాద్ :** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన నిర్మాణ సంస్థపై భారీ భూకబ్జా ఆరోపణలు వెల్లువెత్తాయి. హైదరాబాద్ శివార్లలో రూ.300 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలతో మంత్రి కుమారుడు హర్షా రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఉన్న తమ భూమిని కబ్జా చేసేందుకు నవంబర్ 30వ తేదీ అర్ధరాత్రి ప్రయత్నం జరిగిందని పల్లవి షా అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 70 మంది ముసుగులు ధరించిన వ్యక్తులు నాలుగు జేసీబీలతో అక్రమంగా ప్రవేశించి, ఆస్తి చుట్టూ ఉన్న ప్రహరీ గోడను ధ్వంసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని అడ్డుకోబోయిన తమ సిబ్బంది శివ చరణ్, శ్రీను, ధరంపాల్‌పై దాడి చేసి, చట్టవిరుద్ధంగా నిర్బంధించారని తెలిపారు.భూమికి సంబంధించి జిల్లా కోర్టు, హైకోర్టు నుంచి ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నాయని చెప్పినా దుండగులు వినలేదని, స్థలంలోని గోశాలను, సెక్యూరిటీ గార్డు టెంట్‌ను కూడా కూల్చివేశారని బాధితురాలు ఆరోపించారు. దుండగులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పేరు చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.పల్లవి షా ఫిర్యాదు మేరకు పోలీసులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్, న్యూజెన్ బిల్డర్స్ సంస్థలతో పాటు సుధీర్ షా, ప్రశాంత్ తదితరులపై అక్రమ చొరబాటు, దాడి, అక్రమ నిర్బంధం వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే, ఈ ఆరోపణలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖండించారు. తన కుటుంబ సంస్థపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న భూవివాదమని, దీనితో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.



# నల్లగా ఉన్న ఈ ఆహారాలు..

## ఆరోగ్యానికి దివ్యౌషధాలు..

చాలా మంది ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి పండ్లు, కూరగాయలను తీసుకుంటారు. అయితే.. తీసుకునే ఆహారం సరైన క్రమంలో తీసుకోవడం చాలా మంచిది. ఆరోగ్యంగా ఉండటానికి బ్లాక్ ఫుడ్స్ కూడా ఎంతగానో సహాయపడతాయి. అయితే ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని బ్లాక్ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు తెలిసుకుందాం. మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే ఇవి కూడా ట్రై చెయ్యండి. నల్ల అత్తిపండ్లు: అంజీర్ తీపిగా ఉంటుంది. కానీ అందులో చక్కెర పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ప్రొటీన్, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండే నల్ల అత్తి పండ్లను తినాలని వైద్యులు కూడా సూచిస్తారు. మీరు ప్రతిరోజూ రెండు నల్ల అత్తి పండ్లను రాత్రి నానబెట్టి, ఉదయం పరగడుపున తింటే చాలా మంచిది. నల్ల వెల్లుల్లి: బ్లాక్ వెల్లుల్లి రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దీంతోపాటు ఈ వెల్లుల్లి గుండెకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది అనేక ఇతర వ్యాధుల నుండి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మినుములు: ప్రోటీన్ లోపాన్ని అధిగమించడానికి మినుములు తీసుకోవడం మంచిది. వీటిలో కార్బోహైడ్రేట్లు, విటమిన్ దీ6, పొటాషియం, కాల్షియం ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మినుములు తినడం వల్ల గుండెతో పాటు నాడీ వ్యవస్థకు కూడా మేలు కలుగుతుంది. నల్ల ఎండుద్రాక్ష: ఎండుద్రాక్షల్లో ప్రోటీన్, పిండి పదార్థాలు, ఫైబర్, చక్కెర, కాల్షియం, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ మరియు విటమిన్ సి వంటి అనేక పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్షలు గుండె, బిపి, ఎముకలు, ఉదరం, జుట్టు, చర్మానికి, రక్తహీనతకు కూడా ఇది మేలు చేస్తుంది. బ్లాక్ రైస్: చాలా మంది వైట్ రైస్ తింటారు. కానీ మీరు ఎప్పుడైనా బ్లాక్ రైస్ గురించి విన్నారా.. వీటిలో పీచు, ప్రొటీన్‌తో పాటు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. బ్లాక్ రైస్ ఒత్తిడిని తగ్గిస్తుంది. బ్లాక్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం చాలా మంచిది.

## గంటకి ఓసారి 5 నిమిషాలు నడిస్తే..

# అనారోగ్యం ఇక ఖతం

ఉదయం లేచి 45 నిమిషాల నుండి గంట పాటు వేగంగా నడవడం ఉత్తమ మార్గం. కానీ నేటి బిజీ జీవనశైలిలో, ఎవరూ దీని కోసం ఒక గంట సమయం కేటాయించలేరు. కాబట్టి మనం నడవడం మానేస్తాము. అప్పుడు మనం రోజంతా ఒకే చోట కూర్చుని ఆఫీసులో పని చేస్తాము. ఈ విషయాలు శారీరక ఆరోగ్యాన్ని చాలా చాలా చెడుగా ప్రభావితం చేస్తాయి. ప్రతి గంటకు 5 నిమిషాలు ఎందుకు నడవాలి? మనం రోజంతా ఒకే చోట కూర్చుని పని చేస్తాము. అలా జరిగినప్పుడు, కాళ్ళ కండరాలు బిగుతుగా మారుతాయి. వాటికి వశ్యత ఉండదు. ఇది ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. ఈ ఐదు నిమిషాల నడక మీకు సరళంగా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. ఉద్యోగాల మధ్య గంటకు ఒకసారి ఐదు నిమిషాల నడకకు సమయం లేదని చెప్పే వారు ఎవరూ లేరు. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: మీరు గంటల తరబడి లేదా రోజంతా ఒకే చోట కూర్చున్నప్పుడు, మీ నడుము దిగువ భాగంలో, ముఖ్యంగా మీ మోకాళ్ల క్రింద రక్తం పేరుకుపోతుంది, దీని వలన మీ రక్త ప్రవాహం నెమ్మదిస్తుంది. ప్రతి గంటకు 5 నిమిషాలు లేచి నడవడం వల్ల మీ నడుము దిగువ భాగంలో రక్త ప్రవాహం పెరుగుతుంది , ఇది మీ గుండెకు తీసుకెళ్లే ఆక్సిజన్ మొత్తాన్ని పెంచుతుంది. శరీరానికి శక్తి అందుతుంది: ఒకే చోట ఎక్కువసేపు కూర్చునే వ్యక్తులు కొంచెం బద్ధకంగా ఉంటారు. వారు శారీరకంగా అలసిపోతారు. ఏదో ఒక సమయంలో, వారు తమ పనిపై దృష్టి పెట్టలేరు. పరధ్యానంలో మరియు నీరసంగా ఉంటారు. దీనికి ప్రధాన కారణం శరీర శక్తి తగ్గుతుంది. కానీ మధ్యలో ఐదు నిమిషాలు లేచి నడవడం ద్వారా, మీ మనస్సు కూడా ఉల్లాసంగా ఉంటుంది. శారీరక కదలిక, శక్తి స్థాయిలు ఉత్తేజితమవుతాయి. మీరు తక్షణ శక్తిని పొందుతారు. నడక ఇన్సులిన్ నిరోధకతను సరిచేస్తుంది: మధుమేహ వ్యాధిగ్రస్తులకు, కాళ్ళ కండరాల కదలిక ఇన్సులిన్ స్రావాన్ని, దాని వ్యయాన్ని నియంత్రిస్తుంది. మీరు రోజంతా ఒకే చోట కూర్చున్నప్పుడు, మీ రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. మీ బరువు కూడా పెరుగుతుంది. ఇటీవల, వైద్యులు అటువంటి సమస్యలను కొంతవరకు నియంత్రించడానికి తిన్న తర్వాత పది నిమిషాలు నడవాలని మీకు సలహా ఇస్తున్నారు. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే కాకుండా ప్రీ-డయాబెటిక్స్‌కు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మీ బొడ్డు కుంగిపోకుండా ఉండటానికి ఐదు నిమిషాల నడక: ముఖ్యంగా పొత్తి కడుపులో ఊబకాయం, మద్యం సేవించేవారిలో, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారిలో, రోజంతా ఒకే చోట పనిచేసేవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం జీవక్రియ చాలా నెమ్మదిగా ఉంటుంది మీరు జీవక్రియను ప్రేరేపించాలనుకుంటే, కేలరీలను బర్న్ చేయాలనుకుంటే, శారీరక శ్రమ చాలా ముఖ్యం.మీరు ఉదయం, సాయంత్రం ఎంత నడిచినా, ప్రతి గంట తర్వాత లేదా భోజనం తర్వాత ఒక చిన్న నడక తీసుకోవడం వల్ల మీ శరీరంలో పెద్ద తేడా ఉంటుంది. మీరు తిన్న తర్వాత మీ సీటులో కూర్చుంటే, అది బొడ్డు నొప్పికి కారణమవుతుంది. మీరు దానిని నివారించాలనుకుంటే, మీరు అప్పుడప్పుడు లేచి ఐదు నిమిషాలు చిన్న నడకకు వెళ్ళవచ్చు.



## పాలు తాగినప్పుడు ఇలాంటి ఆహారాలు తినకూడదు



పాలు పోషకమైనవి, కానీ కొన్ని ఆహారాలతో కలిపి తీసుకోవడం జీర్ణక్రియను దెబ్బతీసి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. పుల్లని పండ్లు, చేపలు, ఉప్పు, ఊరగాయలు, ఉల్లిపాయలు వంటివి పాలతో కలిపి తీసుకోకూడదు. ఈ కలయికలు కడుపు ఉబ్బరం, అజీర్ణం, చర్మ సమస్యలు వంటి ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయి. సరైన ఆహార కలయికలతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. పాలు మన రోజువారీ ఆహారంలో అత్యంత పోషకమైన భాగాలలో ఒకటిగా చెబుతారు. పాలు శరీరానికి కావాల్సిన బలాన్ని అందిస్తాయి. శరీర పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పాలు కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. కానీ పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి అస్సలు తీసుకోకూడదు. చాలా మందికి పాలు అన్ని రకాల ఆహారాలతో తీసుకోకూడదని తెలియదు. అలాంటప్పుడు పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి తీసుకోవటం వల్ల లాభాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. పాలతో కలిపి ఎప్పుడూ తినకూడని ఆహారాలు కొన్ని ఉన్నాయి. ఈ కాంబినేషన్ శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. పాలు నారింజ, నిమ్మ, జామ, ఇతర పుల్లని పండ్లు పాలతో కలిపి ఎప్పుడూ తీసుకోకూడదు. ఈ కాంబినేషన్ తీసుకుంటే అవి కడుపులో పాలు గడ్డ కట్టేలా చేస్తాయి. దీని వలన అజీర్ణం, కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలను కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం పాలు, చేపలను కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. చర్మంపై మచ్చలు, అలర్జీలు లేదా దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. పాలు, ఉప్పు కలిగిన ఆహారాల కలయిక జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. శరీర జీవక్రియ ప్రక్రియను బలహీనపరుస్తుంది. ఇది భారంగా, అసౌకర్యంగా ఉంటుంది. పాలతో ఊరగాయ తినడం వల్ల ఎసిడిటీ, గ్యాస్ సమస్యలు వస్తాయి. ఎందుకంటే పులియబెట్టడం, మసాలా దినుసులు పాలు చల్లదనాన్ని దెబ్బతీస్తాయి. పాలతో ఉల్లిపాయలను తీసుకోవడం హానికరం అని చెబుతారు. ఎందుకంటే ఇది శరీరంలో వేడిని, విషాలను పెంచుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో అసమతుల్యతకు దారితీస్తుంది. పాలు, ముల్లంగిని కలిపి తీసుకోవడం వల్ల చర్మ అలర్జీలు, దురద లేదా పుండ్లు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే వాటి వ్యతిరేక లక్షణాలు శరీర సమతుల్యతను దెబ్బతీస్తాయి.

# సర్వరోగ నివారిణి డ్రాగన్ ఫ్రూట్!

డ్రాగన్ ఫ్రూట్.. ఇది విభిన్నమైన పండు. ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. ఇకపోతే, డ్రాగన్ ఫ్రూట్ డయాబెటిస్ రోగులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్.. ఇది విభిన్నమైన పండు. ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. శరీరానికి అవసరమైన పోషకాలు, ఖనిజాలు సమృద్ధిగా నిండి ఉంటాయి. రోజుకో పండు తినటం వల్ల రోజంతా శక్తివంతంగా, ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. డ్రాగన్ ఫ్రూట్ లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నీరు– డైటరీ ఫైబర్ అధికంగా వున్న డ్రాగన్ ఫ్రూట్ మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఐరన్ పుష్కలంగా ఉండి రక్తహీనతను తగ్గిస్తుంది. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. డ్రాగన్ ఫ్రూట్ తినడం ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. డ్రాగన్ ఫ్రూట్ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లోని భాస్వరం, మెగ్నీషియం దృఢమైన ఎముకలు, దంతాల నిర్మాణానికి సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ ఎక్కువగా వుంటుంది. కనుక ఇది బరువు తగ్గడానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల ఉచిత ఆర్గానిక్ ఫైబర్ లభిస్తుంది. ఇది బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇకపోతే, డ్రాగన్ ఫ్రూట్ డయాబెటిస్ రోగులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల డయాబెటిస్ రోగులకు మంచి ఎంపిక. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో వయస్సు మీద పడే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. అలాగే డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని సంరక్షిస్తాయి. పర్యావరణ కాలుష్యం వల్ల చర్మానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి.



# బిజినెస్

## అమెరికాకు మూడు రెట్లు పెరిగిన స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు



అంతర్జాతీయ వాణిజ్యంలో సవాళ్లు ఉన్నప్పటికీ, ఈ ఏడాది అక్టోబర్‌లో మనదేశం నుంచి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమ తులు మూడు రెట్లు పెరిగి 1.47 బిలియన్ డాలర్ల(రూ. 13.26 వేల కోట్ల)కు చేరుకున్నాయి. గతేడాది అక్టోబర్‌లో వీటి ఎగుమతుల విలువ 0.46 బిలియన్ డాలర్లు(రూ. 4,150 కోట్లు)గా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 10.78 బిలియన్ డాలర్ల(రూ. 97 వేల కోట్లకు పైగా) పెరిగాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 3.60 బిలియన్ డాలర్లు(రూ. 32.5 వేల కోట్లు)గా ఉందని డేటా పేర్కొంది. అమెరికా ప్రభుత్వం విధించిన అధిక టారిఫ్ సంబంధిత అనిశ్చితులు డిమాండ్, ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉన్నప్పటికీ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు స్థిరంగా ఉన్నాయని ఓ అధికారి తెలిపారు. ప్రధాన కంపెనీలు ముఖ్యంగా యాపిల్ చైనా నుంచి భారత్‌కు ఉత్పత్తిని మార్చడం వల్ల మన దేశం నుంచి ఎక్కువ ఎగుమతులు నమోదవుతున్నాయి. ఇదే సమయంలో భారత ప్రభుత్వం స్థానిక తయారీకి విధానాలు, ప్రోత్సాహకాలతో మద్దతివ్వడంతో హై-ఎండ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇప్పుడు మనదేశంలోనే తయారవుతున్నాయి. పెరుగుతున్న తయారీ, సరఫరా కారణంగా భారత్‌లో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల సామర్థ్యం ఊపందుకుంది. మరోవైపు ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు అమెరికా కొనుగోలుదారులకు భారత్ నుంచి ఎక్కువ కొనేందుకు కారణమయ్యాయి. ఈ పరిణామాలు యాపిల్‌తో పాటు శాంసంగ్, మోటొరోలా వంటి ఇతర స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు కూడా భారత్ నుంచి ఎగుమతులు పెంచేందుకు దోహదపడ్డాయి.

## ఇండిగో విమానాల రద్దుపై డీజీసీఏ దర్యాప్తు



ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు, ఆలస్యంపై నియంత్రణ సంస్థ డీజీసీఏ బుధవారం దర్యాప్తును ప్రారంభించింది. ప్రస్తుత పరిస్థితికి కారణాలు, విమానాల రద్దు, ఆలస్యాన్ని తగ్గించేందుకు తీసుకున్న ప్రణాళికలు, చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. డీజీసీఏ ఎప్పటికప్పుడు పరిస్థితులు, పరిణామాలను పరిశీలిస్తోందని, ప్రయాణీ కులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించేందుకు విమానాల రద్దు, ఆలస్యాన్ని తగ్గించేందుకు ఇండిగోతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇటీవల ఇండిగో ఇచ్చిన పనితీరుపై సమాచారం ప్రస్తావించిన డీజీసీఏ, నవంబర్‌లో మొత్తం 1,232 విమానాలను రద్దు చేసింది. వీటిలో సిబ్బంది, కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనల పరిమితుల కారణంగా 755 విమానాలు ఉన్నాయని తెలిపింది. అలాగే, విమానాశ్రయాల పరిమితుల కారణంగా 258, ఎయిర్ ట్రాఫి కంట్రోల్ వ్యవస్థ వైఫల్యం కారణంగా 92 విమానాలు, ఇతర కారణాలతో మరో 127 విమానాలు రద్దు అయ్యాయని ఇండిగో వివరించినట్టు డీజీసీఏ వెల్లడించింది. కాగా, దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఇండిగో బుధవారం ఒక్కరోజే వివిధ ఎయిర్‌పోర్టులలో 100కి పైగా విమానాలను, రెండు రోజుల వ్యవధిలో 300కి పైగా విమానాలను రద్దు చేసింది. సిబ్బంది కొరత కారణంగా కొన్ని విమానాలను ఆలస్యంగా నడుపుతున్నట్టు, అనేక సేవల్లో అంతరాయం ఏర్పడిందని, కార్యకలాపాలను మరో 48 గంటల్లో సరిదిద్దనున్నట్టు ప్రకటించింది.

# బీమా కవచ్, ప్రొటెక్షన్ ప్లస్.. ఎల్ఐసీ నుంచి రెండు కొత్త స్కీమ్స్




లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. మరో రెండు కొత్త పథకాల్ని ఆఫర్ చేస్తోంది. వీటిల్లో ఎల్ఐసీ బీమా కవచ్- నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఒకటి.ఇది ప్యూర్ రిస్క్ కవరేజీ అందిస్తుంది. మరొకటి ఎల్ఐసీ ప్రొటెక్షన్ ప్లస్ స్కీమ్.. ఇది నాన్ పార్టిసిపేటింగ్, లింక్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్స్ ప్లాన్. ఈ రెండు ప్రొడక్ట్స్.. భారతదేశంలోని పౌరులు మాత్రమే కొనుగోలు చేసేందుకు వీలుంటుంది. ఇది ఎల్ఐసీ ఉత్పత్తుల శ్రేణిని మరింత మెరుగుపరుస్తుందని.. ఇంకా మార్కెట్ ఉనికిని మరింత విస్తరించి బలోపేతం చేస్తుందని ఎల్ఐసీ నమ్ముతోంది. ఎల్ఐసీ బీమా కవచ్ ప్లాన్ విషయానికి వస్తే ఇది ఇండివిడ్యువల్, నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ ప్యూర్ రిస్క్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. ప్రధానంగా ఈ ప్లాన్ జీవిత బీమా రక్షణపైనే దృష్టి సారిస్తుంది. ఇక్కడ పాలసీదారు.. పాలసీ వ్యవధిలోనే మరణించినట్లయితే వారి కుటుంబానికి ఆర్థిక భద్రత అందిస్తుందని చెప్పొచ్చు. నాన్ పార్టిసిపేటింగ్ అంటే ఇక్కడ బోనస్ వంటివి ఉండవు. అంటే మెచ్యూరిటీపై బోనస్ లభించదని చెప్పొచ్చు. ఇది మార్కెట్ లింక్డ్ కాదు కాబట్టి.. పెట్టుబడి నష్టభయాలు ఏం ఉండవని తెలుసుకోవాలి. ఈ ప్లాన్ గురించి పూర్తి సమాచారం.. డిసెంబర్ 3న స్కీమ్ లాంఛ్ అయిన తర్వాత తెలుస్తుందని చెప్పొచ్చు. ఎల్ఐసీ ప్రొటెక్షన్ ప్లస్ అనేది ఒక సేవింగ్స్ ప్లాన్. ఇది నాన్ పార్టిసిపేటింగ్ స్కీమ్. అయితే బీమా కవచ్‌కు భిన్నంగా ఇది మార్కెట్ లింక్డ్ ఇండివిడ్యువల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. అంటే పెట్టుబడిపై నష్టభయం ఉంటుంది. అయితే ఇక్కడ జీవిత బీమా రక్షణ అందిస్తూ.. పొదుపు ప్రయోజనాల్ని కూడా కల్పిస్తోంది. రెండు రకాల ప్రయోజనాలు ఉంటాయన్నమాట. వ్యక్తిగతంగా, అలాగే కుటుంబ పరంగా భద్రత, పెట్టుబడి సదుపాయాల్ని అందిస్తోంది.అంతకుముందు కూడా ఎల్ఐసీ.. అక్టోబర్ నెలలో రెండు కొత్త ప్రొడక్ట్స్ తీసుకొచ్చింది. అవి మహిళల కోసం ఉద్దేశించిన ఎల్ఐసీ బీమా లక్ష్మి ఒకటి కాగా.. మరొకటి ఎల్ఐసీ జన్ సురక్షా ప్లాన్. ఇవి ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు రెండు కొత్త పథకాల గురించి పూర్తి సమాచారం కోసం ఇంకొక్క రోజు ఎదురు చూడాలి. ఎల్ఐసీ ఇటీవల జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 10,098 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 31 శాతం ఎక్కువ. నికర ప్రీమియం ఆదాయం రూ. 1,26,930 కోట్లుగా నమోదైంది. ఎల్ఐసీ షేర్ ధర సెషన్‌లో స్వల్పంగా పెరిగి రూ. 883 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ. 5.59 లక్షల కోట్లుగా ఉంది.

## హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం-వెండి ధరలు సడన్ డ్రాప్



హైదరాబాద్‌లోని బులియన్ మార్కెట్ ఈరోజు ఒక్కసారిగా మార్పు చెందింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్స్ మరియు స్థానిక డిమాండ్ కారణంగా బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఈ మార్పు రత్నాల షాపుల్లో కొనుగోలుదారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా, పండుగలు, వివాహాల సీజన్‌లో ఇలాంటి డ్రాప్ ఎంతో ప్రయోజనకరంగా మారుతుంది. మార్కెట్ విశ్లేషకులు ఈ తగ్గుదల తాత్కాలికమేనని, త్వరలో మళ్లీ పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. 24 క్యారెట్ బంగారం ధరలు ఈరోజు గణనీయంగా పడిపోయాయి. 10 గ్రాములకు రూ.220 తగ్గి, ఇప్పుడు రూ.1,30,360కు చేరాయి. ఈ మార్పు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారికి పెద్ద లాభంగా మారింది. గత కొన్ని రోజుల్లో ధరలు ఎక్కువగా ఉండటంతో, ఇప్పుడు ఇది సరైన సమయంగా మారింది. రత్నాల డిజైనర్లు కూడా ఈ రేట్లతో కొత్త మోడల్స్‌ను తయారు చేయడంలో ఆసక్తి చూపుతున్నారు. 22 క్యారెట్ పసిడి ధరలు కూడా ఇదే రీతిలో తగ్గాయి. 10 గ్రాములకు రూ.200 పతనమై, ఇప్పుడు రూ.1,19,500 పలుకుతోంది. ఈ రేట్ గ్రామ జ్యువెలరీలకు మరింత అందుబాటులా మారింది. సాధారణ కొనుగోలు దారులు ఈ అవకాశాన్ని పొందుతున్నారు. మార్కెట్ ట్రేడర్లు ఈ తగ్గుదలకు గ్లోబల్ ఎకనామిక్ ఫ్యాక్టర్లను కారణంగా చెబుతున్నారు. వెండి ధరలు కూడా గణనీయంగా తగ్గాయి, కేజీకి రూ.1,000 పడిపోయి రూ.2,00,000గా ఉన్నాయి. ఇది ఇండస్ట్రియల్ యూస్‌లో వెండిని ఉపయోగించే వ్యాపారులకు మంచి వాతావరణాన్ని సృష్టించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ధరలు దాదాపు సమానంగానే ఉన్నాయి. ఈ మార్పు మొత్తం దక్షిణ భారత మార్కెట్‌కు ప్రభావం చూపుతోంది.

# స్పోర్ట్స్

# ఆస్ట్రేలియా గడ్డపై రూట్ తొలి సెంచరీ.. ఊపిరి పీల్చుకున్న వెటరన్ ఓపెనర్



సుదీర్ఘ ఫార్మాట్‌లో పరుగుల వరద పారిస్తున్న ఇంగ్లండ్ స్టార్ జో రూట్ తన కల సాకారం చేసుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న శతకాన్ని అందుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో రెండోదైన గబ్బా టెస్టులో సమయోచిత సెంచరీతో చెలరేగాడు రూట్. ప్రధాన ఆటగాళ్ల వైఫల్యంతో మరోసారి కుప్పకూలేలా కనిపించిన జట్టును ఆదుకుంటూ ఆసీస్ గడ్డపై తొలిసారి వంద కొట్టాడీ రన్ మెషీన్. పింక్ బాల్ టెస్టులో ఒత్తిడిలోనూ పట్టుదల కనబరిచి.. 181 బంతుల్లో మూడంకెల స్కోర్ చేరుకున్నాడు ఇంగ్లండ్ స్టార్. యాసెస్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ సెంచరీ చేయకుంటే తాను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో నగ్నంగా నడుస్తానని వెల్లడించాడు. ‘ఆల్ ఓవర్ బార్ ది క్రికెట్’ అనే పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ‘యాషెస్ ఆల్‌టైమ్ జట్టు’లో రూట్ పేరు లేకపోవడాన్ని అతడు తప్పుపట్టాడు. ఫ్యాబ్ 4లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న రూట్‌ను పక్కన పెట్టడం అవివేకమని హేడెన్ అన్నాడు. అంతటితో ఆగకుండా ఎవరూ ఊహించని కామెంట్ చేశాడీ వెటరన్. ‘ఇంగ్లండ్ స్క్వాడ్‌లో అన్నివిధాల ఉపయుక్తమైన క్రికెటర్ రూట్. మీరు అతడిని ఆల్‌టైమ్ టీమ్‌లో తీసుకోకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రస్తుతం రూట్ సగటు 40. అత్యధిక స్కోర్ 180. ఈ వేసవిలో ఆసీస్‌పై అతడు సెంచరీ కొట్టకుంటే నేను ఎంసీజీలో నగ్నంగా నడుస్తాను’ అని ఆల్‌ఓవర్ బార్ ది క్రికెట్ పాడ్‌కాస్ట్‌లో హేడెన్ పేర్కొన్నాడు. హేడెన్ చేసిన కామెంట్స్‌పై అతడి కూతురు గ్రేస్ హ్యారిస్ ఫన్నీగా స్పందించింది. ‘ప్లీజ్ రూట్.. సెంచరీ కొట్టు’ అని కామెంట్ చేసింది.

### మూడుసార్లు 80 ల్లోనే

ఇతర జట్లపై చెలరేగిపోయే ఈ సొగసరి బ్యాటర్ ఆస్ట్రేలియాలో ఒక్క సెంచరీ కొట్టలేదు. గత 27 ఇన్నింగ్స్‌ల్లో 35.68 సగటుతో 892 రన్స్ చేశాడంతే. మూడుసార్లు రూట్ 80 ల్లోనే ఔటయ్యాడు. దాంతో, ఈసారైనా కంగారూ నేలపై శతకం బాదాలనే కసితో ఉన్నాడీ నంబర్ 1 బ్యాటర్. యాషెస్ సిరీస్ 2025-26 ఈ ఏడాది నవంబర్ 21 నుంచి జనవరి 8 వరకూ జరుగనుంది. అయితే.. గత మూడు పర్యాయాలు కంగారూ గడ్డపై ఇంగ్లండ్ జట్టు ఓడిపోతూ వస్తోంది. 2011 తర్వాత ఇంగ్లీష్ టీమ్ అక్కడ ఒక్కటంటే ఒక్క టెస్టు గెలువలేదు. సో.. ఈ చెత్త రికార్డును చెరిపేయాలని బెన్ స్టోక్స్ బృందం అనుకుంటోంది.

### 5 పరుగులకే 2 వికెట్లు

గబ్బా టెస్టు ఆరంభంలోనే ఇంగ్లండ్‌కు మిచెల్ స్టార్క్ పెద్ద షాకిచ్చాడు. ఓపెనర్ బెన్ డకెట్(0), ఓలీ పోప్(0)లను ఔట్ చేసి.. పర్యాటక జట్టును ఒత్తిడిలో పడేశాడు. 5 పరుగులకే 2 వికెట్లు పడిన అనంతరం క్రీజులోకి వచ్చిన రూట్.. కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ జాక్ క్రాలే(76)తో కలిసి జట్టును ఆదుకుంటూ స్కోర్‌బోర్డును నడిపించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపికగా ఆడిన రూట్181 బంతుల్లో కంగారూ గడ్డపై మొదటి శతకం సాధించాడు.

## చరిత్ర సృష్టించిన మిచెల్ స్టార్క్



ఆసీస్ స్పీడ్ గన్ మిచెల్ స్టార్క్ చరిత్ర సృష్టించాడు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా పాకిస్తాన్ దిగ్గజం వసీం అక్రమ్ రికార్డును బద్దలు కొట్టాడు. యాషెస్ సిరీస్ రెండో టెస్ట్ తొలి రోజు ఇది జరిగింది. హ్యారీ బ్రూక్ వికెట్ తీయడంతో స్టార్క్ ఖాతాలో ఈ రికార్డు వచ్చి చేరింది. వసీం అక్రమ్ 104 టెస్ట్‌ల్లో 414 వికెట్లు తీయగా.. స్టార్క్ 102వ టెస్ట్‌లోనే ఈ ఘనత సాధించాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్లు (టాప్-5)

స్టార్క్-415 వసీం అక్రమ్-414 చమిండ వాస్-355 బౌల్ట్-317 జహీర్ ఖాన్-311

మ్యాచ్ విషయానికొస్తే.. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ఇవాళే మొదలైన మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. వారి ఈ సంతోషాన్ని స్టార్క్ ఎంతో సేపు మిగిల్చలేదు. ఓపెనర్ బెన్ డకెట్, అదే స్కోర్ వద్ద (5) వన్ డౌన్ బ్యాటర్ ఓలీ పోప్‌ను డకౌట్ చేశాడు. అనంతరం కొద్ది గ్యాప్ ఇచ్చి హ్యారీ బ్రూక్‌ను (31) పెవిలియన్‌కు పంపాడు. 42 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ స్కోర్ 182/4గా ఉంది. డకెట్, పోప్, క్రాలే, బ్రూక్ ఔట్ కాగా.. జో రూట్ (65), కెప్టెన్ బెన్ స్టోక్స్ (4) క్రీజ్‌లో ఉన్నారు. స్టార్క్ 3 వికెట్లు తీయగా.. మైఖేల్ నెసర్ ఓ వికెట్ దక్కించుకున్నాడు. స్టార్క్ నిప్పులు చెరగడంతో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ ఆతర్వాత కుదురుకుంది. రూట్, క్రాలే అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి మూడో వికెట్‌కు 117 పరుగులు జోడించారు. క్రాలే 76 పరుగుల వద్ద ఉండగా నెసర్ అద్భుతమైన బంతితో క్రాలే వికెట్ తీశాడు. అనంతరం రూట్‌తో జత కలిసిన బ్రూక్ కాసేపు పోరాడాడు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 54 పరుగులు జోడించారు. ఈ దశలో మరోసారి బంతినందుకున్న స్టార్క్ బ్రూక్‌ను బోల్తా కొట్టించి, ఇంగ్లండ్‌ను మరోసారి కష్టాల్లోకి నెట్టేశాడు. రూట్, స్టోక్స్ ఇంగ్లండ్‌ను గౌరవప్రదమైన స్కోర్ దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, 5 మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

## ‘అతడొక ఆల్ ఫార్మాట్ ప్లేయర్.. ఇకనైనా మారండి’



రాయ్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారత్ ఓటమి పాలైనప్పటికి.. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తన అద్భుత ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో గైక్వాడ్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన మహారాష్ట్ర స్టార్.. ప్రత్యర్థి బౌలర్లపై తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో గైక్వాడ్ 77 బంతుల్లోనే తన తొలి వన్డే సెంచరీ మార్క్‌ను మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో భారత మాజీ చీఫ్ సెలెక్టర కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రుతురాజ్ తన సత్తా నిరూపించుకున్నాడని, అతడికి వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వాలని టీమ్ మెనెజ్‌మెంట్‌ను సూచించాడు. కాగా శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా సఫారీలతో వన్డే సిరీస్‌కు దూరం కావడంతో రుతురాజ్‌కు సెలక్టర్లు పిలుపునిచ్చారు. తొలి వన్డేలో విఫలమైనప్పటికి.. రెండో వన్డేలో మాత్రం కమ్ బ్యాక్ ఇచ్చాడు. సెంచరీతో పాటు విరాట్ కోహ్లీతో కలిసి 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. “జట్టు సెలక్షన్ విషయంలో ఇకపై పెద్దగా ప్రయోగాలు చేయరని ఆశిస్తున్నాను . రతురాజ్ అద్భుతమైన ఆటగాడు. అతడికి మూడు ఫార్మాట్‌లలోనూ రాణించే సత్తా ఉంది. కచ్చితంగా రుతురాజ్ ఆల్ ఫార్మాట్ జట్టులో ఉండటానికి అర్హుడు. అతడికి అవకాశాలు ఇవ్వండి. టెస్టుల్లో కూడా సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పటికే రంజీ ట్రోఫీలో తనను నిరూపించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అయితే రుతురాజ్ అద్భుతంగా ఆడాడు. భారత జట్టులోకి వచ్చి రాగానే సెంచరీ సాధించడం చాలా సంతోషంగా ఉంది. అతడు తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సౌతాఫ్రికా వంటి బౌలింగ్ అటాక్‌పై సెంచరీ కొట్టడం గొప్ప విషయం “అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో పేర్కొన్నాడు.




# పూలరంగడు కాంబో రిపీట్.. 'దివ్య దృష్టి'తో వస్తోన్న సునీల్, ఇషాచావ్లా

సునీల్, ఇషా చావ్లా కాంబోలో పూల రంగడు, మిస్టర్ పెళ్లి కొడుకు సినిమాలు వచ్చాయని తెలిసిందే. వీటిలో పూలరంగడు మంచి హిట్‌గా నిలువగా.. మిస్టర్ పెళ్లి కొడుకు ఆశించిన స్థాయిలో సక్సెస్ తెచ్చుకోలేకపోయింది. కాగా ఈ ఇద్దరు లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ ఓ ప్రాజెక్టులో కలిసి నటిస్తున్నారు. సునీల్, ఇషాచావ్లా నటిస్తోన్న సినిమా దివ్య దృష్టి సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సాగే హార్రర్ థ్రిల్లర్‌గా ఉండబోతుందని టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ హింట్ ఇచ్చేస్తుంది. అయితే దివ్య దృష్టి థియాట్రికల్ రిలీజ్ కాకుండా డైరెక్టుగా ఓటీటీలో విడుదల కానుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం సన్ నెక్స్ట్‌లో డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. సినిమాటోగ్రఫర్ కమ్ డైరెక్టర్ కబీర్ లాల్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నాడు. కమల్ కామరాజు కీలక పాత్రలో నటిస్తున్నాడు. త్వరలోనే ప్రమోషన్స్ మొదలు పెట్టనున్నారు మేకర్స్.



# స్పిరిట్ షూట్‌కు బ్రేక్.. హామీ ప్రకారం జపాన్‌కు ప్రభాస్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో 2025 డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం రేపు జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి–ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.



# రూ. 400 కోట్ల సినిమా ఫ్లాప్.. ఆర్థికంగా చాలా నష్టపోయాం రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'బడే మియా చోటే మియా' బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. రకుల్ భర్త జాకీ భగ్నానీకి చెందిన పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ సుమారు రూ. 400 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించింది. అయితే భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం రూ.60 కోట్ల వసూళ్లను సాధించి అట్టర్‌ఫ్లాప్ అందుకోవడమే కాకుండా తమ కుటుంబానికి భారీ నష్టం వాటిల్లిందని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపింది. బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రకుల్ మాట్లాడుతూ.. పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో వచ్చిన గత మూడు సినిమాలు ఆశించిన విజయం అందుకోలేదు. దీంతో ఈ విషయంలో మాకు చాలా ఆర్థిక నష్టం జరిగింది. అయితే ఇలాంటి ఇబ్బందులు ప్రతి నిర్మాతకూ వస్తాయి. అమితాబ్ బచ్చన్ గారికి కూడా ఒక సమయంలో జరిగింది. ఇది కేవలం ఒక దశ మాత్రమే. మేము తప్పకుండా మళ్ళీ పుంజుకుంటాం అని రకుల్ అన్నారు. అయితే ఈ ఆర్థిక నష్టాల వలన తమ నిర్మాణ సంస్థ 'పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్' మూతపడిందనే వదంతులను ఆమె పూర్తిగా ఖండించారు. మీడియాలో పరిస్థితిని ఎక్కువగా చూపిస్తున్నారని, కంపెనీ సేవలు కొనసాగుతున్నాయని రకుల్ స్పష్టం చేశారు. అంతకుముందు జాకీ భగ్నానీ స్వయంగా ఈ సినిమా వైఫల్యం గురించి మాట్లాడుతూ, భారీ పెట్టుబడి కోసం తమ కుటుంబం ఆస్తులను కూడా తాకట్టు పెట్టాల్సి వచ్చిందని, పెట్టిన పెట్టుబడిలో కేవలం 50 శాతం కంటే తక్కువే తిరిగి వచ్చిందని వెల్లడించారు.

# టాలీవుడ్ సస్పెన్స్ థ్రిల్లర్.. టీజర్ వచ్చేసింది..!



ఆది పినిశెట్టి, మడోన్నా సెబాస్టియన్ జంటగా నటించిన థ్రిల్లర్ మూవీ డ్రైవ్. ఈ మూవీకి జెనూస్ మొహమ్మద్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై వి ఆనంద ప్రసాద్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇవాళ రిలీజైన టీజర్ చూస్తుంటే సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో సీన్స్ చూస్తే ఫుల్ గ్రిప్పింగ్ అండ్ సర్వైవల్ థ్రిల్లర్‌ను తలపించేలా ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా డిసెంబర్ 12న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో రాజా చెంబోలు, కమల్ కామరాజు, అనీష్ యోహాన్ కురువిల్లా కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి ఓషో వెంకట్ సంగీతమందించారు.




# భయపెట్టించే మరో హారర్.. గ్లింప్స్‌తోనే వణికించిన 'ఈషా'

తెలుగులో ప్రాపర్ హారర్ మూవీ వచ్చి చాలా రోజులవుతుంది. కామెడీ హారర్ చిత్రాలు తరచు వస్తున్నాయి కానీ.. పూర్తిగా భయపెట్టే చిత్రాలేవి రావట్లేదు. ఇప్పుడు ఆ లోటును తీర్చేందుకు 'ఈషా' వచ్చేస్తుంది. త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రూపొందిన హారర్ థ్రిల్లర్‌కి శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్‌తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. సరికొత్త థ్రిల్లింగ్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. ఒక నిమిషం రెండు సెకన్ల నిడివి గల ఈ గ్లింప్స్ చూస్తేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఆత్మలు ఉన్నాయా లేదా అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కించినట్లు తెలుస్తోంది.

PRINTER, PUBLISHER AND OWNED BY **M Surekha,** AND PRINTED AT Sidharatha PUBLICATIONS #4-1-737/4, B.T.S. Colony, Vikarabad, Vikarabad Dist., (T.S)
EDITOR : **M Surekha**. E-mail: aksharamedha@gmail.com, Cell : 9492028209, RNI REGD NO : TELTEL/202079565